


# నేటి దిక్సూచి

www.netidiksuchi.com

తెలుగు దినపత్రిక

TGTEL/25/A3190




ప్రచురణ. రంగారెడ్డి, సంపుటి:01 సంచిక :125 ఎడిటర్ పి. అలివేలు పేజిలు : 04, వెల. 2రూ/ మంగళవారం- 25 - ఆగస్టు - 2026

## ఒకేసారి వస్తున్న రైళ్లు - ఔటర్ల వద్దే పడిగాపులతో ప్రయాణికులకు నరకం



- ఏకకాలంలో రెండు, మూడు రైళ్లు వచ్చేలా రైల్వే షెడ్యూళ్లు
- పరిమిత ప్లాట్‌ఫారమ్‌లు ఉండటంతో తప్పని ఇబ్బందులు
- ఖాళీ లేక ఔటర్ సిగ్నళ్ల వద్దే రైళ్ల నిరీక్షణ
- ఏకకాలంలో రెండు, మూడు రైళ్లు వచ్చేలా రైల్వే షెడ్యూళ్లు
- ఏకకాలంలో రెండు, మూడు రైళ్లు వచ్చేలా రైల్వే షెడ్యూళ్లు

ఢిల్లి : రైల్వే అధికారుల సమన్వయ లోపం ప్రయాణికులకు శాపంగా మారుతోంది. లోపభూయిష్టమైన రైల్వే షెడ్యూళ్లు ప్రయాణికులకు నరకం చూపిస్తున్నాయి. ఏకకాలంలో రెండు, మూడు రైళ్లు గుంటూరు స్టేషన్‌కు వచ్చేలా టైమ్‌టేబుల్ రూపొందించారు. పరిమిత ప్లాట్‌ఫారమ్‌లు, ట్రాక్‌లు ఉన్న స్టేషన్లలో మిగతా..2లో

## తెలంగాణలో నేడు, రేపు భారీ వర్షాలు కురిసే అవకాశం



- బంగాళాఖాతంలో అల్పపీడనం.. తెలంగాణలో రెండ్రోజులు అతిభారీ వర్షాలు
- పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్
- ఉరుములు, మెరుపులతో పాటు ఈదురుగాలుల హెచ్చరిక
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన

హైదరాబాద్ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో తెలంగాణలో వర్షాలు మళ్లీ ఊపందుకున్నాయి. రానున్న రెండు రోజుల పాటు (ఆగస్టు 24, 25 తేదీల్లో) రాష్ట్రంలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. ఈ మేరకు పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. వాతావరణ శాఖ సూచన ప్రకారం, సోమవారం కుమ్రం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి మిగతా..2లో

## జాబ్ నోటిఫికేషన్లు నిల్.. లిక్కర్ నోటిఫికేషన్లు మాత్రం ఫుల్



- తెలంగాణలో 121 కొత్త మద్యం బ్రాండ్లకు నోటిఫికేషన్ జారీ చేయడంపై మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.
- యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తుంటే..
- జాబ్ నోటిఫికేషన్లు ఇవ్వకుండా లిక్కర్ నోటిఫికేషన్లు మాత్రం జారీ చేస్తున్నారంటూ మండిపడ్డారు.

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం కొత్తగా 121 రకాల మద్యం బ్రాండ్లకు నోటిఫికేషన్ ఇవ్వడంపై

## సీఎం రేవంత్‌తో భట్టి విక్రమార్క భేటీ
# కొండా సుస్మిత, చిన్నారెడ్డిల అంశంపై చర్చ!

- లండన్ నుంచి హైదరాబాద్ చేరుకున్న సీఎం రేవంత్
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో సమావేశం
- తెలంగాణలో జరుగుతున్న తాజా రాజకీయ పరిణామాలపై చర్చించినట్లు సమాచారం



హైదరాబాద్: : లండన్ పర్యటన ముగించుకుని హైదరాబాద్ చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డిని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కలిశారు. అమెరికా పర్యటనకు కేంద్రం నిరాకరణ, తాజా రాజకీయ పరిణామాలపై చర్చించినట్లు సమాచారం. వీటితో పాటు కొండా సుస్మిత, చిన్నారెడ్డిల అంశాలపై మాట్లాడినట్లు తెలిసింది. పెట్టుబడులే లక్ష్యంగా 3 రోజుల పాటు లండన్‌లో పర్యటించిన సీఎం విదేశీ పర్యటన విజయవంతంగా ముగించుకుని భారత్‌కు చేరుకున్నారు. ఈ ఉదయం శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌కు చేరుకున్న ముఖ్యమంత్రికి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీగా చేరుకొని ఘన స్వాగతం పలికారు. మద్దతు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ధన్యవాదాలు : రాజకీయ అంశాలపై హైదరాబాద్ వచ్చిన తర్వాత అన్ని మాట్లాడతానని సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. మూడ్రోజుల లండన్ పర్యటన ముగించుకున్న సీఎం రేవంత్‌రెడ్డి ఈరోజు ఉదయం హైదరాబాద్‌కు చేరుకున్నారు. అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించిన అంశంపై బలమైన మద్దతు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. మిగతా..2లో

## 22పై కొత్త కథలు అల్లి ప్రజలను భయపెడుతున్న ప్రతిపక్షాలు

- హైదరాబాద్‌లో 22పై అబద్ధాలు ప్రచారం చేస్తున్నాయంటూ ప్రతిపక్షాలపై తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిప్పులు చెరిగారు.
- ఈ అంశంపై కొత్త కథలు అల్లి ప్రజలను భయపెడుతున్నాయని ఆయన మండిపడ్డారు.



హైదరాబాద్, ఆగస్టు 24: హైదరాబాద్‌లో 22ఏపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నాయంటూ ప్రతిపక్షాలపై తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిప్పులు చెరిగారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. 22పై కొత్త కథలు అల్లి ప్రజలను భయపెడుతున్నాయని ఆయా పార్టీలపై మండిపడ్డారు. గతంలో రిలాక్స్ ఇచ్చిన వాటికి క్లియరెన్స్ ఇచ్చామని తెలిపారు. నిజమైన (జెన్యూన్‌గా) వాటిలో 98 శాతం రిజిస్ట్రేషన్ చేశామన్నారు. చేయలేనివి చేయలేమని తేల్చి చెప్పామని వివరించారు. అయితే టోల్ ఫ్రీ నంబర్ పని చేయడం లేదంటూ ప్రతిపక్షాలు చేస్తున్న వాదనను మంత్రి పొంగులేటి ఖండించారు. అందులో వాస్తవం లేదని చెప్పారు. ఇప్పటి వరకు ఈ టోల్ ఫ్రీ నంబర్‌కు 1,162 కాల్స్ వచ్చాయని పేర్కొన్నారు. అందులో రిపీటెడ్ కాల్స్ తొలగిస్తే.. 980 వచ్చాయన్నారు. వాటిలో 547 వ్యవసాయానికి అనుబంధమైనవి, 433 వ్యవసాయేతర కాల్స్ అని వివరించారు. రిజిస్ట్రేషన్ కాలేదని ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కొందరు దొంగ జీవోలు, మిగతా..2లో

## పాక్ ఆర్మీ చీఫ్‌పై మౌలానా ఫైర్.. 1971 ఓటమిని గుర్తుచేస్తూ తీవ్ర విమర్శలు



- పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్‌పై జేయూఐఎఫ్ నేత ఫజ్లుర్ రెహ్మాన్ ఆగ్రహం
- 1971 యుద్ధ ఓటమిని ప్రస్తావిస్తూ ప్రస్తుత పరిస్థితులపై హెచ్చరిక
- నిరంతర అణచివేత కొత్త భౌగోళిక సరిహద్దులకు దారితీస్తుందని వ్యాఖ్య
- ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే సైన్యం సంబరాలు చేసుకోవడం సరికాదన్న మౌలానా

ఢిల్లి : పాకిస్థాన్ సైన్యంపై ఆ దేశంలోనే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. జమియత్ ఉలేమా-ఎ-ఇస్లాం

## భారత వారసత్వాన్ని ఎందుకు నాశనం చేయాలనుకుంటున్నారు?
## రాహుల్‌పై సీఎం యోగి

- రాహుల్ గాంధీపై యోగి ఆదిత్యనాథ్ ఘాటు విమర్శలు
- మనుస్మృతిపై రాహుల్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించిన యూపీ సీఎం
- రాజ్యాంగబద్ధ పదవిలో ఉండే భారత సంప్రదాయాలను అవమానిస్తున్నారని ఆరోపణ
- ఉత్తర్‌ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్



ఢిల్లి : కాంగ్రెస్ ఎంపీ, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పార్లమెంట్ లో కీలక రాజ్యాంగబద్ధ పవిలో ఉన్న రాహుల్, ప్రజాస్వామ్య వ్యవస్థతో పాటు భారత సంప్రదాయాలు, సంస్కృతి, వారసత్వాన్ని పదేపదే కించప రుస్తున్నారని ఆరోపించారు. మనుస్మృతిపై రాహుల్ ఇటీవల మహారాష్ట్రలో చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, మిగతా..2లో

## విజయ్ సర్కార్ భారీ ప్రకటనలు..
# ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు
## మహిళలకు ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణం

- ఏడాదికి 3 ఉచిత ఎల్‌పీజీ సిలిండర్లు అందించనున్న తమిళనాడు ప్రభుత్వం
- 2027 సంక్రాంతి నుంచి 'అన్నపూర్ణి సూపర్ సిక్స్' అమలు
- రూ.2.5 లక్షల లోపు ఆదాయం ఉన్న కుటుంబాలకు పథకం వర్తింపు




- ట్రాన్స్‌జెండర్లకు ఉచిత బస్సు ప్రయాణం ప్రకటించిన విజయ్

ఢిల్లి : తమిళనాడు అసెంబ్లీలో ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ సోమవారం పలు కీలక సంక్షేమ పథకాలను ప్రకటించారు.

## శ్రావణమాసం మూడో శుక్రవారం కొత్త పార్టీని ప్రకటిస్తా



- పార్టీ పేరు, జెండా, విధివిధానాలపై క్లారిటీ ఇచ్చిన విజయసాయిరెడ్డి
- విజయవాడ వేదికగా పూర్తి వివరాలను వెల్లడిస్తానన్న విజయసాయి
- ప్రజల గొంతుక వినిపించేందుకు ప్రతిపక్ష హోదా అక్కర్లేదని వ్యాఖ్య

అమరావతి: తాను కొత్త పార్టీని ప్రారంభించపోతున్నట్లు మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే.

## రైతులే పారిశ్రామికవేత్తలు కావాలి..
# గోర్మే పాప్‌కార్న్ ఒక విప్లవం

- దేశంలో తొలి నాన్-జీఎంఓ పాప్‌కార్న్ విత్తనాన్ని అభివృద్ధి చేసిన గోర్మే సంస్థ
- సీడ్ ను ఆవిష్కరించిన ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, సీఎం చంద్రబాబు
- 11 ఏళ్లలో 69% మార్కెట్ వాటాతో గోర్మే అద్భుత విజయం సాధించిందన్న సీఎం
- రైతులను పారిశ్రామికవేత్తలుగా చూడటమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం
- ఫుడ్ ప్రాసెసింగ్‌పై యువత దృష్టి పెట్టాలని చంద్రబాబు పిలుపు
- చింతలపూడి పథకం పూర్తి చేసి నూజివీడు రూపురేఖలు మారుస్తామని హామీ




అమరావతి : వ్యవసాయాన్ని కేవలం జీవనోపాధిగా కాకుండా ఒక ఆర్థిక శక్తిగా చూడాలని, రైతులను పారిశ్రామికవేత్తలుగా మార్చాలన్నదే తమ ప్రభుత్వ విధానమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. దేశంలోనే మొట్టమొదటి నాన్-జీఎంఓ పాప్‌కార్న్ హైబ్రిడ్ విత్తనాన్ని అభివృద్ధి చేసిన 'గోర్మే పాప్‌కార్న్స్' సంస్థ ఒక వినూత్న విప్లవానికి శ్రీకారం చుట్టిందని ఆయన కొనియాడారు. ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్‌తో కలిసి నూజివీడు సమీపంలోని ముసునూరులో జరిగిన గోర్మే సంస్థ కార్యక్రమంలో పాల్గొన్న చంద్రబాబు, కొత్తరకం పాప్ కార్న్ సీడ్ ను ఆవిష్కరించారు. సంస్థ విజయగాథను స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళతామని ఆయన ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "ఒకప్పుడు మన దేశంలో అమ్ముడైన ప్రతి పాప్‌కార్న్ గింజపై మనం ఖర్చు చేసిన డబ్బులో 70 శాతానికి పైగా బ్రెజిల్, అర్జెంటీనా వంటి దేశాలకు వెళ్లేది. కానీ, గోర్మే సంస్థ కృషితో ఇప్పుడు ఆ 70 శాతం ఆదాయం మన దేశ రైతులకే దక్కుతోంది. కేవలం 11 ఏళ్లలో ఈ సంస్థ దేశానికి 125 మిలియన్ అమెరికన్ డాలర్ల (దాదాపు రూ.1000 కోట్లకు పైగా) విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేసింది. ఇది మనందరికీ గర్వకారణం" అని ప్రశంసించారు. 2014లో ప్రారంభమైన ఈ సంస్థ, నేడు ఆసియాలోనే అతిపెద్ద పాప్‌కార్న్ ప్రాసెసింగ్ కేంద్రంగా ఎదగడం, 8 రాష్ట్రాల్లో మిగతా..2లో

## ఏపీకి ఉపరాష్ట్రపతి.. స్వాగతం పలికిన నారా లోకేశ్

- ఏలూరు జిల్లాలో పర్యటిస్తున్న భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్
- దేశంలోనే తొలి నాన్-జీఎంఓ పాప్‌కార్న్ మొక్కజొన్న విత్తనాన్ని ఆవిష్కరించనున్న ఉపరాష్ట్రపతి
- ఈ కార్యక్రమంలో పాల్గొననున్న గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు నాయుడు
- ఇది రైతులకు మేలు చేకూర్చే కీలక ముందడుగు అన్న మంత్రి నారా లోకేశ్
- ఉపరాష్ట్రపతి రాక సందర్భంగా ఏలూరు, కృష్ణా జిల్లాల్లో పటిష్ట భద్రతా ఏర్పాట్లు



అమరావతి : భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ సోమవారం ఆంధ్రప్రదేశ్‌లో పర్యటిస్తున్నారు. ఏలూరు జిల్లా ముసునూరు మండలంలో ఏర్పాటు చేసిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొనేందుకు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనకు గన్నవరం విమానా శ్రయంలో మంత్రి నారా లోకేశ్ స్వాగతం పలికారు. ఈ పర్యటనలో రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా పాలుపం చుకోనున్నారు. వివరాల్లోకి వెళితే, ముసునూరు మిగతా..2లో

మొదటి పేజి తరువాయి

## శ్రావణమాసం మూడో శుక్రవారం కొత్త పార్టీని ప్రకటిస్తా

ఈ విషయానికి సంబంధించి ఆయన ఈరోజు మరింత క్లారిటీ ఇచ్చారు. శ్రావణమాసం మూడో శుక్రవారం నాడు తన నూతన రాజకీయ పార్టీకి సంబంధించిన పేరు, జెండా, విధివిధానాలు మరియు పూర్తి ప్రణాళికను విజయవాడ వేదికగా అధికారికంగా వెల్లడిస్తానని ఆయన స్పష్టం చేశారు. ప్రజాసమస్యలపై పోరాడేందుకు, ప్రజల తరపున గొంతుక వినిపించేందుకు చట్టసభల్లో ప్రత్యేకంగా ప్రతిపక్ష హోదా ఏమీ అవసరం లేదని విజయసాయి వ్యాఖ్యానించారు. ప్రస్తుతం రాష్ట్రంలో వైసీపీ మాత్రమే ఏకైక ప్రతిపక్షంగా ఉందని పేర్కొన్నారు. సాధారణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, వారి సమస్యలను నేరుగా సభల వరకు తీసుకెళ్లేందుకు ఒక బలమైన స్వతంత్ర రాజకీయ వేదికను ఏర్పాటు చేయడమే తన లక్ష్యమని తెలిపారు.

## సీఎం రేవంత్‌తో భట్టి విక్రమార్క భేటీ
## కొండా సుస్మిత, చిన్నారెడ్డిల అంశంపై చర్చ!

దేశ ప్రయోజనాల కోసం ఈ విషయంలో అండగా నిలిచిన పార్టీ, నాయకులు, ప్రజలకు కృతజ్ఞతలు అంటూ రాసుకొచ్చారు. రాజకీయ కారణాలతోనే ఆపేశారు : లండన్‌లో షెడ్యూలు ప్రకారం సమావేశాలు, కార్యక్రమాలను ముగించినట్లు సీఎం తెలిపారు. ముందస్తు షెడ్యూలు ప్రకారం బోస్టన్‌కు వెళ్లాల్సి ఉండగా కేంద్ర ప్రభుత్వం రాజకీయ కారణాలతో అమెరికా పర్యటనకు పర్మిషన్ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ నూతన విద్యావిధానంలో భాగంగా ప్రపంచంలోని అత్యుత్తమ సంస్థలను తెలంగాణకు తీసుకురావడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ఐవీలీగ్, ప్రపంచ అత్యున్నత సంస్థల నుంచి విద్య, నైపుణ్యాలు, శిక్షణ పొందాలనే యువత ఆకాంక్షలకు ఈ పర్యటన సమాధానంగా నిలిచేదన్న సీఎం రేవంత్ రెడ్డి దేశ నిర్మాణం, యువత భవిష్యత్తుపై రాజకీయాలకు అతీతంగా ఆలోచించాలని సూచించారు. తెలంగాణ కాంగ్రెస్ లో నేతల తీరుపై చర్చించి నేడు ఓ నిర్ణయానికి రానున్నట్లు తెలుస్తోంది.

## 22పై కొత్త కథలు అల్లి ప్రజలను
## భయపెడుతున్న ప్రతిపక్షాలు

మెమోలు తెచ్చి రిజిస్ట్రేషన్ కోసం ఒత్తిడి చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. అలాంటివారిపై కేసులు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి దొంగ జీవోలతో రిజిస్ట్రేషన్ చేసుకోవడం సాధ్యం కాదని మంత్రి పొంగులేటి కుండ బద్దలు కొట్టారు. సిఎస్7, సిఎస్ 14పై దశాబ్దాలుగా వివాదాలు ఉన్నాయని గుర్తు చేశారు. తెర ముందు సామాన్యులను పెట్టి వెనక తమ ఎజెండాను అమలు చేస్తున్నారని అన్నారు. వివాదాస్పద భూములు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పలువురు చూస్తున్నారని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో ఖరీదైన కార్లు తీసుకుని సిఎస్7, సిఎస్14 భూములు రిజిస్ట్రేషన్ చేశారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఆ విషయాన్ని లేవనెత్తడంతో వివాదంలో పడ్డాయని వివరించారు. ఆ 811 ఎకరాల భూములపై విచారణకు సిద్ధమా? అని ప్రతిపక్షాలను ఆయన సూటిగా ప్రశ్నించారు. సర్వే నంబర్ 403లో సీఎం రేవంత్ రెడ్డి నివాసం ఉంటుందని అన్నారు. ఆ సర్వేలో1,288 ఎకరాలు ఉండగా రెండు ప్లాట్లు మాత్రమే నిషేధిత జాబితాలో ఉన్నాయని చెప్పారు. అధికారులు చేసిన తప్పిదం వల్ల ఆ సర్వే మొత్తం నిషేధిత జాబితాలోకి వెళ్లితే సరిచేశామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వివరించారు.

## జాబ్ నోటిఫికేషన్లు నిల్..
## లిక్కర్ నోటిఫికేషన్లు మాత్రం ఫుల్

బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా స్పందించారు. రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇవ్వకుండా.. మద్యం బ్రాండ్లకు మాత్రం నోటిఫికేషన్లు జారీ చేస్తున్నారంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. 'జాబ్ నోటిఫికేషన్లు నిల్.. లిక్కర్ నోటిఫికేషన్లు మాత్రం ఫుల్' అంటూ హరీశ్ రావు ఎద్దేవా చేశారు. యువత భవిష్యత్తుకు భరోసా కల్పించాల్సిన ప్రభుత్వం ఉద్యోగాల భర్తీపై దృష్టి పెట్టకుండా మద్యం వ్యాపారంపై ఎందుకు అంత ఆసక్తి చూపుతోందని ప్రశ్నించారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని, వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని హరీశ్ రావు పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం లిక్కర్ అమ్మకాలపైనే ఎక్కువ శ్రద్ధ చూపుతోందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ప్రభుత్వ తీరుపై విమర్శలు చేశారు.

### 121 కొత్త మద్యం బ్రాండ్లకు నోటిఫికేషన్

తెలంగాణలో కొత్తగా 121 రకాల మద్యం బ్రాండ్లు అందుబాటులోకి రానున్నట్లు ఆదివారం ప్రకటన వెలువడింది. సుమారు 18 కంపెనీలకు చెందిన మద్యం సరఫరాదారులు ఈ బ్రాండ్లను రాష్ట్రంలో ప్రవేశపెట్టనున్నట్లు ఎక్సైజ్ శాఖ తెలిపింది.

## తెలంగాణలో నేడు, రేపు భారీ వర్షాలు కురిసే అవకాశం

అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసి, అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ఇవి కాకుండా ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ సహా రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడతాయని ఐఎండీ తెలిపింది. వర్షం సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. హైదరాబాద్ నగరం, దాని పరిసర ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై ఉంటుందని, తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రత 30 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 22 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యే అవకాశం ఉంది. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నదులు, వాగుల సమీపంలో నివసించే వారు మరింత జాగ్రత్తగా ఉండాలని, అనవసర ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

## విజయ్ సర్కార్ భారీ ప్రకటనలు..
## ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు

ఏడాదికి మూడు ఉచిత ఎల్‌పీజీ సిలిండర్లు అందించే పథకంతో పాటు ట్రాన్స్‌జెండర్లకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. 'అన్నపూర్ణి సూపర్ సిక్స్' పేరుతో గ్యాస్ సిలిండర్ల పథకం అమల్లోకి రానుంది. 2027 సంక్రాంతి నుంచి దీనిని ప్రారంభించనున్నారు. ఏటా రూ.2.5 లక్షల లోపు ఆదాయం ఉన్న కుటుంబాలకు ఈ ప్రయోజనం వర్తిస్తుంది. సుమారు 1.30 కోట్ల కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. అర్హులైన కుటుంబాలు కొనుగోలు చేసే మూడు గ్యాస్ సిలిండర్ల ఖర్చును నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు. ఈ పథకానికి ఏటా సుమారు రూ.4,000 కోట్ల వ్యయం అవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. గల్ఫ్ ప్రాంతంలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితులతో గ్యాస్ కొరత, ధరల పెరుగుదల కుటుంబాలపై అదనపు భారాన్ని మోపాయని విజయ్ తెలిపారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణ పథకం పరిధిని ప్రభుత్వం విస్తరించింది. ఇకపై సాధారణ బస్సులతో పాటు ఎక్స్‌ప్రెస్, ఎల్ఎస్ఎస్, డీలక్స్ బస్సుల్లోనూ మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చు. జిల్లాల మధ్య నడిచే బస్సుల్లోనూ ఈ సదుపాయం కల్పించనున్నారు. 'వెట్రి పయనం' పేరుతో అక్టోబర్ 2 నుంచి ఈ విస్తరణ అమల్లోకి వస్తుంది. ట్రాన్స్‌జెండర్లకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించనున్నట్లు విజయ్ ప్రకటించారు. చెన్నై సమీపంలోని పరందూర్ విమానాశ్రయ ప్రాజెక్టుపై విజయ్ మరోసారి తన వ్యతిరేకతను స్పష్టం చేశారు. ప్రాజెక్టుతో ప్రభావితమయ్యే కుటుంబాల పక్షాన నిలుస్తామని చెప్పారు. ప్రత్యామ్నాయ ప్రాంతాలను ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాలను గుర్తించినట్లు తెలిపారు. ప్రస్తుత మీనంబాక్కం, చెన్నై విమానాశ్రయంలోని కొత్త టెర్మినల్-5 నిర్మించనున్నట్లు కూడా ప్రకటించారు.

## పాక్ ఆర్మీ చీఫ్‌పై మౌలానా ఫైర్..
## 1971 ఓటమిని గుర్తుచేస్తూ తీవ్ర విమర్శలు



(జేయూఐ-ఎఫ్) చీఫ్ మౌలానా ఫజ్లుర్ రెహ్మాన్, ప్రస్తుత ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్‌పై ఘాటు విమర్శలు గుప్పించారు. 1971 యుద్ధంలో పాకిస్థాన్ ఎదుర్కొన్న పరాభవాన్ని గుర్తుచేస్తూ, సైన్యం తీరును ఆయన తూర్పారబట్టారు. పెషావర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఫజ్లుర్ రెహ్మాన్ మాట్లాడుతూ, దేశంలో నిరంతర అణచివేత, రక్తపాతం కొనసాగితే నూతన భౌగోళిక సరిహద్దులు ఏర్పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సామాన్య ప్రజలు అష్టకష్టాలు పడుతుంటే, సైన్యం ప్రగల్భాలు పలకడం ఎంతమాత్రం సరికాదని ఆయన మండిపడ్డారు. 1971 యుద్ధానికి ముందు నాటి ఆర్మీ చీఫ్ యాహ్యా ఖాన్ చేసిన వ్యాఖ్యలను ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. "మేము శత్రువులతో పర్వతాల్లో, ఎడారుల్లో, వీధుల్లో పోరాడతాం. మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరు" అని యాహ్యా ఖాన్ నాడు అన్నారని, కానీ చివరకు పాకిస్థాన్ సైన్యం ఘోర పరాజయాన్ని మూటగట్టుకుందని రెహ్మాన్ ఎద్దేవా చేశారు. భారత్‌తో కేవలం 13 రోజుల పాటు జరిగిన ఆ యుద్ధం ఫలితంగానే బంగ్లాదేశ్ ఆవిర్భవించిందని, 1971 డిసెంబర్ 16న సుమారు 93,000 మంది పాకిస్థాన్ సైనికులు భారత దళాల ఎదుట లొంగిపోయారని ఆయన గుర్తుచేశారు. నాటి పరిస్థితులకు, నేటికీ పెద్దగా వ్యత్యాసం లేదని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంటే సైన్యం సంబరాలు చేసుకోవడం భావ్యం కాదని ఫజ్లుర్ రెహ్మాన్ అభిప్రాయపడ్డారు.

# రైతులే పారిశ్రామికవేత్తలు కావాలి.. గౌర్మే పాప్‌కార్న్ ఒక విప్లవం

మొదటి పేజి తరువాయి





17,500 మంది రైతులతో 40,000 ఎకరాల్లో సాగు చేస్తూ దేశంలోని 3,400 సినిమా థియేటర్లకు పాప్‌కార్న్‌ను సరఫరా చేయడం అసాధారణ విజయమని కొనియాడారు. సంస్థ ఎండీ పట్టాభిరామారావు గారి కుటుంబానికి వ్యాపార దక్షత, రైతులను ఆదుకునే వారసత్వం ఉన్నాయని గుర్తుచేశారు. వ్యవసాయ రంగంలో విలువ జోడింపు (ఖఞ్రీబవ ాాఎంఓఅశీఅ) ప్రాధాన్యతను వివరిస్తూ, "ఆంధ్రప్రదేశ్‌లో ఆక్వా, అరటి, మామిడి, మిరప, పసుపు, పామాయిల్ వంటి ఎన్నో వాణిజ్య పంటలు పండుతున్నాయి. అయితే, వాటిని ప్రాసెస్ చేసి, బ్రాండ్ సృష్టించి అంతర్జాతీయ మార్కెట్‌కు తీసుకెళ్లినప్పుడే రైతు రాజుగా ఎదుగుతాడు. గౌర్మే సంస్థ పొలం నుంచి వినియోగదారుడి వరకు ట్రేసబిలిటీతో ఒక పక్కా వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఇదే మోడల్‌ను రాష్ట్రంలోని ఇతర పంటలకు కూడా వర్తింపజేయాలి" అని చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రస్తుతం రాష్ట్రం నుంచి ఎగుమతి అవుతున్న ఆక్వా ఉత్పత్తుల్లో కేవలం 10 శాతం మాత్రమే ప్రాసెస్ అవుతోందని, దీనిని 60-70 శాతానికి పెంచగలిగితే ఉపాధి అవకాశాలు, విదేశీ మారక ద్రవ్యం భారీగా పెరుగుతాయని విశ్లేషించారు. రాష్ట్రంలో నీటి భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. "ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో 52 శాతం వర్షపాతం లోటు ఏర్పడింది. అయినప్పటికీ, గతంలో నిర్మించిన పట్టిసీమ ద్వారా గోదావరి నీటిని కృష్ణా డెల్టాకు తరలించి రైతులను కొంతవరకు ఆదుకోగలిగాం. నూజివీడు ప్రాంత భవిష్యత్తును మార్చే చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును న్యాయపరమైన అడ్డంకులు తొలగించి త్వరలోనే పూర్తి చేస్తాం. దశాబ్దాల కల అయిన వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ఈ ఆగస్టు 31న జాతికి అంకితం చేస్తున్నాం. పోలవరం ఎడమ కాలువ ద్వారా ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి నీటిని అందిస్తున్నాం" అని చంద్రబాబు వివరించారు. దేశంలోని నదుల అనుసంధానం ఆవశ్యకతను నొక్కిచెబుతూ, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ ఈ ఆశయానికి మద్దతునివ్వడం అభినందనీయమన్నారు. "గోదావరి, కృష్ణా, తుంగభద్ర, పెన్నా, కావేరి నదులను అనుసంధానిస్తే నాలుగు దక్షిణాది రాష్ట్రాల నీటి సమస్యలు శాశ్వతంగా పరిష్కారమవుతాయి. ఇదే స్ఫూర్తితో గంగ-బ్రహ్మపుత్ర నదుల నీటిని కూడా సద్వినియోగం చేసుకోగలిగితే దేశ భవిష్యత్తు అప్రతిహతంగా ముందుకు సాగుతుంది" అని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా, పది మందికి ఉద్యోగాలు ఇచ్చే పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆయన పిలుపునిచ్చారు. టెక్నాలజీని వ్యవసాయంతో అనుసంధానించి ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలోకి వస్తే ఆకాశమే హద్దుగా రాణించవచ్చని సూచించారు. గౌర్మే సంస్థ చూపిన 'అవుట్ ఆఫ్ బాక్స్' ఆలోచనా విధానం రాష్ట్రంలోని యువతకు స్ఫూర్తిదాయకమని, ఇలాంటి వినూత్న స్టార్టప్‌లకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, మంత్రులు నారా లోకేశ్, అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

# ఏపీకి ఉపరాష్ట్రపతి.. స్వాగతం పలికిన నారా లోకేశ్

మొదటి పేజి తరువాయి

గ్రామంలోని గౌర్మెట్ పాప్‌కార్న్ పరిశ్రమ ప్రాంగణంలో ఈ కార్యక్రమం జరగనుంది. ఈ సందర్భంగా, ఆ సంస్థ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన దేశంలోనే మొట్టమొదటి నాన్-జీఎంఓ (జన్యుపరంగా మార్పు చేయని) పాప్‌కార్న్ మొక్కజొన్న హైబ్రిడ్ విత్తనాన్ని ఉపరాష్ట్రపతి లాంఛనంగా ఆవిష్కరిస్తారు. అనంతరం పాప్‌కార్న్ సాగు చేస్తున్న మొక్కజొన్న రైతులను సత్కరించనున్నారు. వ్యవసాయ రంగంలో ఇది ఒక ముఖ్యమైన ఆవిష్కరణగా భావిస్తున్నారు. ఈ పర్యటనపై మంత్రి నారా లోకేశ్ స్పందించారు. ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఏలూరుకు స్వాగతం పలకడం ఆనందంగా ఉందని తెలిపారు. "రైతుల కోసం ఆవిష్కరణలు, వారికి మరింత విలువను సృష్టించే దిశగా ఇది ఒక ముఖ్యమైన ముందడుగు" అని ఆయన తన ప్రకటనలో పేర్కొన్నారు. ఉపరాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో అధికారులు యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి స్వయంగా కార్యక్రమ ప్రాంగణాన్ని పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. భద్రతా పరంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టారు. ఉపరాష్ట్రపతి భద్రతా సిబ్బంది, ఏలూరు జిల్లా కలెక్టర్ కె. వెట్రి సెల్వి, ఏలూరు రేంజ్ ఐజీపీ జీవీజీ అశోక్ కుమార్, ఏలూరు, కృష్ణా జిల్లాల ఎస్పీలతో కూడిన ఉన్నత స్థాయి బృందం అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీ లైజన్ సమావేశం నిర్వహించి భద్రతను సమీక్షించింది. ఉపరాష్ట్రపతి ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని,



అక్కడి నుంచి రోడ్డు మార్గంలో ముసునూరుకు ప్రయాణమయ్యారు.

# ఒకేసారి వస్తున్న రైళ్లు - ఔటర్ల వద్దే పడిగాపులతో ప్రయాణికులకు నరకం

మొదటి పేజి తరువాయి

ఒకే సమయంలో రైళ్లు వస్తున్నాయి. లేదా కేవలం ఒకట్రెండు నిమిషాల వ్యవధిలో వేర్వేరు రైళ్లు వచ్చేలా షెడ్యూల్ చేశారు. దీనివల్ల ప్రయాణికులకు తీవ్ర అవాంతరాలు ఏర్పడుతున్నాయి. ముందు వచ్చిన రైలుకు ప్లాట్‌ఫారమ్ ఇస్తే, వెనుక వచ్చిన రైళ్లు ఔటర్ సిగ్నళ్ల వద్దనే నిరీక్షించాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. ఒక్క నిమిషం వ్యవధిలోనే రాకపోకలు : ప్రధాన స్టేషన్లలో రైళ్ల రాకపోకల షెడ్యూల్ అస్తవ్యస్తంగా మారింది. ఇతర ఓవర్ ల్యాపింగ్ రైళ్లతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఉదాహరణకు సికింద్రాబాద్-అనకాపల్లి ఎక్స్‌ప్రెస్ (17043) సోమవారం తెల్లవారుజామున 3.29 గంటలకు గుంటూరు స్టేషన్‌కు చేరుకోవాలి. సరిగ్గా ఒక్క నిమిషం వ్యవధిలో ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ (18464) 3.30 గంటలకు రావాలి. సికింద్రాబాద్-నహర్‌లాగూన్ (07046) మధ్యాహ్నం 1.20 గంటలకు గుంటూరు స్టేషన్ నుంచి నిష్క్రమించాల్సి ఉంది. సరిగ్గా అదే సమయానికి (మధ్యాహ్నం 1.20 గంటలకు) మార్కాపురం-తెనాలి మెము (67239) చేరుకోవాలి. ఇలాంటి షెడ్యూళ్ల వల్ల ఏ రైలుకు ఎక్కడ ప్లాట్‌ఫారమ్ ఇవ్వాలో తెలియక సిబ్బంది సైతం తలలు పట్టుకుంటున్నారు. ఒకే సమయానికి క్రాసింగ్‌లు : కాకినాడ-ఎల్‌టీటీ



ఎక్స్‌ప్రెస్ (17221) మధ్యాహ్నం 1.40 గంటలకు స్టేషన్ నుంచి బయలుదేరుతుంది. కటిహార్-యశ్వంత్‌పూర్ (06752) రైలు సరిగ్గా 1.40 గంటలకే స్టేషన్‌లోకి రావాల్సి ఉంది. చర్లపల్లి-నాగర్‌కోయిల్ అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ (16358-శనివారం), డోన్-గుంటూరు ప్యాసింజర్ (17227-రోజువారీ) రైళ్లు రెండూ సరిగ్గా మధ్యాహ్నం 2 గంటలకు గుంటూరు జంక్షన్‌కు చేరుకునేలా షెడ్యూల్ చేశారు. ఒకే సమయంలో రెండు రైళ్లు రావడం వల్ల ఒక రైలుకు ప్లాట్‌ఫారమ్ ఇస్తే, మరొక రైలును ఔటర్ సిగ్నల్ వద్ద నిలిపేయాల్సి వస్తోంది. దీంతో ఆయా రైళ్లలోని ప్రయాణికులు చాలాసేపు వేచి ఉండాల్సి వస్తోంది. ఒకేసారి మూడు రైళ్లు : రెండు రైళ్లు ఒకేసారి రావడమే కష్టం అనుకుంటే, ఏకంగా మూడు రైళ్లకు ఒకే సమయాన్ని కేటాయించారు. సిల్చార్-చర్లపల్లి (15646-శుక్రవారం), చర్లపల్లి-అగర్తల (17031-సోమవారం), నరసాపురం-హుబ్లి అమరావతి ఎక్స్‌ప్రెస్ (17225-రోజువారీ) రైళ్లు ఒకే సమయానికి నమోదు కావడం గమనార్హం. ఈ మూడు రైళ్లు ఉదయం 9.05 గంటలకు వచ్చి 9.10 గంటలకు బయల్దేరేలా సమయం ఇచ్చారు. రోజువారీ మెము రైళ్ల పరిస్థితీ ఇంతే. రేపల్లె-గుంటూరు (67234), నరసాపురం-గుంటూరు (67247) ప్యాసింజర్ రైళ్లు రాత్రి 7.55 గంటలకు ఒకేసారి గుంటూరు జంక్షన్ చేరుకునేలా షెడ్యూల్ వేశారు. అర్ధరాత్రి కూడా ఆగని తిప్పలు : పగటి పూటే కాదు రాత్రి వేళల్లో కూడా ఈ ఓవర్ ల్యాపింగ్ సమస్య వేధిస్తోంది. చర్లపల్లి-తిరుచిరాపల్లి ఎక్స్‌ప్రెస్ (17077) బుధవారం రాత్రి 11.50 గంటలకు స్టేషన్‌కు వస్తుంది. 12 గంటలకు బయల్దేరుతుంది. సరిగ్గా అదే సమయంలో విశాఖపట్నం దురంతో (22204) రాత్రి 11.53 గంటలకు వచ్చి 11.55 గంటలకు వెళ్తుంది. ఈ రెండు రైళ్ల రాకపోకల మధ్య ఉన్న గ్యాప్ కేవలం నిమిషాలే. స్టేషన్లలో ప్లాట్‌ఫారమ్‌లు ఖాళీ లేక ఔటర్ వద్ద రైళ్లను ఆపేస్తుండటంతో గమ్యస్థానాలకు చేరుకోవడంలో జాప్యం జరుగుతోంది. ఇప్పటికైనా రైల్వే అధికారులు స్పందించి, రైళ్ల షెడ్యూళ్లలో ఉన్న లోపాలను సరిదిద్దాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## భారత వారసత్వాన్ని ఎందుకు నాశనం చేయాలనుకుంటున్నారు?'
# రాహుల్‌పై సీఎం యోగి ఫైర్

మొదటి పేజి తరువాయి

మనువు గురించి తెలుసుకోవాలంటే ప్రాచీన భారతీయ గ్రంథాలను చదవాలని సూచించారు. ఉత్తర్ ప్రదేశ్ లోని రాయ్ బరేలీలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ, ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. 'ఇటీవల మహారాష్ట్రలో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను గురించి చెబుతున్నా. మహిళలు మనుస్మృతి సంకెళ్ల నుంచి బయటపడాలని రాహుల్ పిలుపునిచ్చారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా రాహుల్‌కు రాజ్యాంగబద్ధమైన బాధ్యతలు ఉన్నాయి. కేవలం రాహుల్ గాంధీగా ఆయనపై దేశ ప్రజలకు పెద్దగా అంచనాలు లేవు. అయితే ప్రతిపక్ష నేత హోదాలో మాత్రం ప్రజాస్వామ్యం పట్ల బాధ్యతగా వ్యవహరించాల్సి ఉంటుంది. మీరు భారత రాజ్యాంగాన్ని పరిరక్షిస్తామని ప్రమాణం చేశారు. కానీ భారత సంప్రదాయాలు, వారసత్వాన్ని అవమానించడం మీ జన్మహక్కుగా భావిస్తున్నట్లుగా కనిపిస్తోంది. మనుస్మృతిపై వ్యాఖ్యలు చేసే ముందు ప్రాచీన భారతీయ సాహిత్యాన్ని అధ్యయనం చేయాలి. మనువు గురించి తెలుసుకోవాలంటే అథర్వవేదం, శతపథ బ్రాహ్మణం, మత్స్య పురాణం వంటి గ్రంథాలను చదవాలి. మనువు, భారతీయ సంప్రదాయాలపై పూర్తి అవగాహన లేకుండా వ్యాఖ్యలు చేయడం సరికాదు.

**యోగి ఆదిత్యనాథ్, ఉత్తర్ ప్రదేశ్ సీఎం**

### ఎమర్జెన్సీపై వ్యాఖ్యలు

రాహుల్ గాంధీ ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటాన్ని కూడా సీఎం యోగి తప్పుపట్టారు. 1975లో కాంగ్రెస్ ప్రభుత్వం విధించిన ఎమర్జెన్సీని ప్రస్తావిస్తూ, ఆ పార్టీ చరిత్రను గుర్తు చేశారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయాల్సిన బాధ్యత కలిగిన ప్రతిపక్ష నేత వ్యవహరిస్తున్న తీరు అందుకు భిన్నంగా ఉందని విమర్శించారు. ఇతర రాష్ట్రాలకు వెళ్లినప్పుడు యూపీని, విదేశాలకు వెళ్తే భారత్‌ను కించపరిచేలా మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఉగ్రవాదంపై రాహుల్ చేసిన వ్యాఖ్యలు పరోక్షంగా దేశ వ్యతిరేక శక్తులకు ప్రోత్సాహం ఇచ్చేలా ఉన్నాయని విమర్శించారు. అయోధ్యలో శ్రీరాముడి ఉనికినే కాంగ్రెస్ ప్రశ్నించిందని ఆరోపిస్తూ, ఆ పార్టీ వైఖరిని తప్పుపట్టారు.

### జంతర్ మంతర్ ఘటనపైనా ప్రస్తావన

ప్రధాని నరేంద్ర మోదీపై జంతర్ మంతర్ వద్ద ఓ యువతి అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినట్లు ప్రచారమైన వివాదాన్ని కూడా సీఎం యోగి ప్రస్తావించారు. అయితే ఆ యువతి, ఆమె తల్లి తమ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణలు చెప్పారని తెలిపారు. 'రాజకీయ విమర్శలకు కూడా కొన్ని హద్దులు ఉండాలి. అర్బన్ నక్సల్స్ చేతిలో దేశ యువత భవిష్యత్తును ఎందుకు నాశనం చేయాలనుకుంటున్నారు? భారత వారసత్వాన్ని ఎందుకు ధ్వంసం చేయాలనుకుంటున్నారు? దేశ భవిష్యత్తును ఎందుకు ప్రమాదంలోకి నెట్టాలనుకుంటున్నారు? ప్రతిపక్ష నేతగా రాహుల్ పార్లమెంట్‌లో నిర్మాణాత్మక పాత్ర పోషించాలని దేశం ఆశించింది. కానీ ఆ అవకాశాన్ని ఆయన వృథా చేసుకున్నారు. అమేఠీ,



రాయ్ బరేలీ ప్రాంతాల ప్రజలు గాంధీ కుటుంబానికి మద్దతు ఇస్తున్నాయి. అయినప్పటికీ ఆ కుటుంబ రాజకీయాల కారణంగా ఆ ప్రాంతం గుర్తింపు సంక్షోభం ఎదుర్కొంటోంది' అని యోగి ఆరోపించారు. ఇటీవల ఛత్రోం కీ గూంజ్ కార్యక్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ, సాంప్రదాయ సమాజంలో మహిళలను కేవలం కూతురు, భార్య లేదా తల్లి అనే మూడు బాక్సులకే పరిమితం చేసే ధోరణి ఉందని విమర్శించారు. ఆ పాత్రల్లో తప్పు లేనప్పటికీ, మహిళల గుర్తింపు కేవలం వాటికే పరిమితం కాకూడదని స్పష్టం చేశారు. . మహిళలు తమ గుర్తింపును తామే చాటుకోవాలని, ఎవరికీ తలవంచకుండా హక్కుల కోసం గళం విప్పాలని పిలుపునిచ్చారు. పితృస్వామ్య భావజాలాన్ని ధైర్యంగా ఎదుర్కొని తమకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకోవాలన్నారు.

# భారత జుఎవీలకు ఇంటర్నెట్, బ్లూటూత్, వైఫై కనెక్టివిటీ లేదు: సీఈసీ జ్ఞానేశ్ కుమార్

దేశ భవిష్యత్తుకు యువతే ప్రధానం- సరైన అవగాహనతో ఎన్నికల ప్రక్రియలో పాల్గొంటే ప్రజాస్వామ్యం మరింత బలోపేతం

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ కీలక వ్యాఖ్యలు

భారత ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల(ఈవీఎం) గురించి భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఈవీఎంలను ప్రభుత్వ రంగ సంస్థలే తయారు చేస్తాయని, వీటికి ఇంటర్నెట్ , బ్లూటూత్ , వైఫై కనెక్టివిటీ లాంటి సదుపాయాలు ఏవీ ఉండవని స్పష్టం చేశారు.సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తన రెండు రోజుల పర్యటనలో భాగంగా, సోమవారం లఖ్ నవూలోని చారిత్రాత్మక కాల్విన్ తాలూక్ దార్ కాలేజీ విద్యార్థులతో ముచ్చటించారు. భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల ప్రక్రియ, ఈవీఎంల విశ్వసనీయం, యువ ఓటర్ల ప్రాధాన్యత గురించి వారితో చర్చించారు. ఈ సందర్భంగా ఈవీఎంల భద్రతకు సంబంధించి విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. "దేశంలో ఎన్నికల ప్రక్రియ కోసం ఉపయోగించే ఈవీఎంలను ప్రభుత్వ రంగ కంపెనీలే ఉత్పత్తి చేస్తాయి. వీటికి ఇంటర్నెట్ కనెక్టివిటీ ఉండదు. అలాగే బ్లూటూత్ , వైఫై కనెక్షన్ లేదా ఇతర వైర్ లెస్ టెక్నాలజీలతో అనుసంధానం ఉండదు" అని జ్ఞానేశ్ కుమార్ స్పష్టం చేశారు. ప్రస్తుత సోషల్ మీడియా కాలంలో, విద్యార్థులు ఏదైనా సమాచారాన్ని నమ్మే ముందు, లేదా ఇతరులతో దాన్ని పంచుకునే ముందు, కచ్చితంగా దాని మూలాలను, ప్రామాణికతను సరిచూసుకోవాలని సీఈసీ సూచించారు.

### చిన్ననాటి జ్ఞాపకాలు

ఈ సందర్భంగా సీఈసీ జ్ఞానేశ్ కుమార్ 1979లో తాను విద్యార్థిగా ఉన్న రోజుల జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. తన జీవిత ప్రయాణాన్ని తీర్చిదిద్దడంలో తన పాఠశాల ఉపాధ్యాయులు ఎంతటి ముఖ్యమైన పాత్ర పోషించారో చెప్పారు. తాను అమెరికా వెళ్లడానికి సిద్ధమవుతున్న రోజులను కూడా ఆయన గుర్తు చేసుకున్నారు. తన తల్లి కోరిక, మాతృభూమిపై ఉన్న మక్కువ కారణంగా తాను భారతదేశంలో ఉండి ప్రజాసేవ చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఆ తర్వాత తాను సివిల్ సర్వీస్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి, ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఏఎస్ ) కేరళ కేడర్ లో చేరారని చెప్పారు. ప్రజాసేవలో భాగంగా తన ప్రయాణం చివరకు ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి ప్రధాన ఎన్నికల కమిషనర్ అయ్యేలా చేసిందని ఆయన పేర్కొన్నారు.

ఇదొక భారీ టాస్క్

భారతదేశ ఎన్నికల ప్రక్రియ గురించి కూడా సీఈసీ కీలక వ్యాఖ్యలు చేశారు. మన దేశంలో దాదాపు 100 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని, ఇంత పెద్ద సంఖ్యలో ఉన్న ఓటర్ల కోసం ఎన్నికలు నిర్వహించడం ఒక భారీ టాస్క్ అని ఆయన అభిప్రాయపడ్డారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు వీలుగా పెద్ద సంఖ్యలో అధికారులు, ఉద్యోగాలు రాత్రింబవళ్లు శ్రమిస్తారని ఆయన తెలిపారు. యువత ఈ ప్రజాస్వామ్య ప్రక్రియలో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 326ను ప్రస్తావిస్తూ, 18 ఏళ్లు నిండిన విద్యార్థులంతా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని జ్ఞానేశ్ కుమార్ కోరారు. ఎన్నికల సంఘం తన డిజిటల్ ప్లాట్ ఫారమ్ ల ద్వారా ఓటర్ల నమోదు కోసం వీలు కల్పిస్తోందని ఆయన వివరించారు. యువత కోసం ఓటర్లుగా మారడమే కాకుండా, తమ కుటుంబ సభ్యులను, స్నేహితులను కూడా ఎన్నికల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని ఆయన సూచించారు. "దేశ ప్రజాస్వామ్య భవిష్యత్తుకు యువత అత్యంత కీలకమైన శక్తి. వారు అవగాహనతో ఎన్నికల ప్రక్రియలో పాల్గొంటే, ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత బలోపేతం అవుతుంది" అని అన్నారు.

యూపీ అసెంబ్లీ ఎన్నికల వేళ

2027లో ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియపై ఓటర్లకు అవగాహన కల్పించడం, పారదర్శకత పెంపొందించడమే లక్ష్యంగా సీఈసీ జ్ఞానేశ్ కుమార్ నేతృత్వంలోని భారత ఎన్నికల సంఘం ప్రతినిధి బృందం సోమవారం లఖ్ నవూకు వెళ్లింది.

# రహదారుల దుస్థితిపై అధికారులకు వినతి

### గుంతలు, బురద, పిచ్చి మొక్కలతో అవస్థలు.. నూతన రహదారి నిర్మాణానికి డిమాండ్



మందమర్రి రూరల్, : మండలంలోని పలు ప్రధాన రహదారులు అధ్వాన్నంగా మారడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మందమర్రి పాలచెట్టు నుంచి అవాడం వెళ్లే ప్రధాన రహదారితో పాటు, ఆదిల్‌పేట్ నుంచి పొన్నారం వయా రసూల్‌పల్లె, జైపూర్ వెళ్లే ప్రధాన రహదారి ప్రస్తుతం పూర్తిగా దెబ్బతిని ప్రమాదకరంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మందమర్రి పాలచెట్టు వద్ద ప్రారంభమై అవాడం వైపు వెళ్లే ప్రధాన రహదారిపై పలుచోట్ల పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వర్షాలు కురిసిన సమయంలో గుంతల్లో నీరు నిలిచిపోవడంతో వాటి లోతు తెలియక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రహదారిని ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో ప్రజలు, రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, ఆటోలు, ద్విచక్ర వాహనదారులు, ఇతర వాహనదారులు వినియోగిస్తున్నారు. అదేవిధంగా ఆదిల్‌పేట్ నుంచి పొన్నారం వయా రసూల్‌పల్లె, జైపూర్ వెళ్లే ప్రధాన రహదారి కూడా తీవ్రంగా దెబ్బతిన్నది. సండ్రోనిపల్లె గ్రామం దాటిన అనంతరం సారంగపల్లి (దుబ్బపల్లె) గ్రామం మూలమలుపు వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతలు వాహనదారులకు ప్రమాదకరంగా మారాయి. వర్షపు నీరు గుంతల్లో నిలిచిపోవడంతో రాత్రి వేళల్లో పరిస్థితి మరింత ప్రమాదకరంగా ఉంటోందని స్థానికులు చెబుతున్నారు.

### రహదారికి ఇరువైపులా పిచ్చి మొక్కలు

రోడ్డుకు ఇరువైపులా బురద మట్టి, మట్టి కుప్పలు పేరుకుపోవడంతో పాటు చెట్లు, పిచ్చి మొక్కలు, పొదలు రహదారిపైకి విస్తరించాయి. దీంతో రహదారి వెడల్పు తగ్గిపోయి ఎదురెదురుగా వాహనాలు వెళ్లేటప్పుడు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు బురదలో జారిపడే ప్రమాదం ఉంది.

రాతల

# గాజుల సవ్వడితో శ్రావణ సందడి



నస్పూర్, : శ్రావణ మాసం సందర్భంగా నస్పూర్ కాలనీలోని షిర్కే ప్రాంతంలో మహిళలు సంప్రదాయబద్ధంగా గాజుల పండుగను ఘనంగా నిర్వహించారు.మహిళలంతా ఒకేచోట చేరి గాజులు ధరించడంతో కాలనీలో పండుగ వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా భార్యాభర్తలు కలిసి వేడుకలో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.భర్త చేత భార్య బొట్టు పెట్టించుకుని, తమకు నచ్చిన రంగురంగుల గాజులను ఎంపిక చేసుకుని ధరించారు.అనంతరం పెద్దల ఆశీర్వాదాలు తీసుకున్నారు.మహిళలు సంప్రదాయ దుస్తుల్లో హాజరై పరస్పరం గాజులు పెట్టుకుంటూ,ఆత్మీయంగా పలకరించుకుంటూ సందడి చేశారు.చిన్నారులు, కుటుంబ సభ్యులు సైతం వేడుకలో పాల్గొని ఉత్సాహాన్ని పంచుకున్నారు.మహిళల నవ్వులు,గాజుల గలగల సవ్వడితో షిర్కే ప్రాంతం కళకళలాడింది.ఆధునిక కాలంలోనూ మన సంస్కృతి,సంప్రదాయాలను కొనసాగిస్తూ భావితరాలకు వాటి విశిష్టతను పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఈ వేడుకను నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.ఇటువంటి సంప్రదాయ కార్యక్రమాలు కుటుంబ సభ్యుల మధ్య అనుబంధాన్ని,మహిళల మధ్య ఆత్మీయతను మరింత పెంపొందిస్తాయని పేర్కొన్నారు.సంప్రదాయానికి అద్దం పట్టేలా నిర్వహించిన గాజుల పండుగ అందరినీ ఆకట్టుకుంది.



# ప్రజా ఫిర్యాదుల వేదికకు అధికారుల డుమ్మా!

### కలెక్టర్ ఆదేశాలకు తిర్యాణిలో బేఖాతరు

### 11 గంటలైనా రాని అధికారులు..

### ప్రజల తీవ్ర అసహనం





తిర్యాణి : మారుమూల గిరిజన గ్రామాల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నిర్దేశించిన ప్రజా ఫిర్యాదుల విభాగానికి మండల స్థాయి అధికారుల నిర్లక్ష్యం శాపంగా మారుతోంది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక పట్ల తిర్యాణి మండల అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు.

### చేతులెత్తేసిన యంత్రాంగం

సోమవారం ఉదయం 11 గంటలు దాటినా కేవలం ఇద్దరు అధికారులు మినహా మిగిలిన ప్రధాన శాఖల అధికారులెవరూ కార్యాలయానికి హాజరుకాలేదు. దీంతో తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియక వచ్చిన అర్జీదారులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. కొందరు అధికారులు బస్సు వేళలను సాకుగా చూపుతూ ఇష్టారాజ్యంగా రాకపోకలు సాగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వర్షంలోనూ వచ్చి.. నిరాశతో వెనుదిరిగి.. వర్షాలను సైతం లెక్కచేయకుండా కొండకోనలు దాటి మండల కేంద్రానికి వచ్చిన ఆదివాసీలు, గిరిజనులు అధికారుల గైర్హాజరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ప్రజల వద్దకే పాలన" అన్న ప్రభుత్వ లక్ష్యం క్షేత్రస్థాయిలో నీరుగారిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పట్ల బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై జిల్లా కలెక్టర్ తక్షణమే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, వేదిక సమయానికి అందరూ అందుబాటులో ఉండేలా ఆదేశాలు ఇవ్వాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# తిర్యాణి మండలంలో డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ షురూ

### గ్రామాల్లో లబ్ధిదారులకు స్మార్ట్ కార్డుల అందజేత





తిర్యాణి : జిల్లా తిర్యాణి మండలంలో డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. మండల కేంద్రంతో పాటు కన్నెపల్లి, గంభీరావుపేట్ గ్రామాల్లో క్యూ.ఆర్. కోడ్‌తో కూడిన నూతన స్మార్ట్ రేషన్ కార్డులను ప్రజాప్రతినిధులు లబ్ధిదారులకు అందజేశారు. తిర్యాణి మండల కేంద్రంలోని రేషన్ దుకాణంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ నైతం రాంచందర్ కార్డుల పంపిణీని ప్రారంభించారు. కన్నెపల్లిలో పీఏసీఎస్ ఛైర్మన్ చుంచు శ్రీనివాస్, గంభీరావుపేట్‌లో గ్రామ సర్పంచ్ జుమ్మిడి కిష్టయ్య లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ డిజిటల్ కార్డుల ద్వారా పేదలకు నిత్యావసర సరుకులు సులభంగా, మరింత పారదర్శకంగా అందుతాయని తెలిపారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి కుటుంబానికీ నేరుగా చేరుతాయని, అర్హులైన ఏ ఒక్కరూ నష్టపోకుండా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలందరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దే విజయ్, ఇంచార్జ్ జీపీఓలు ప్రేమ్ సాగర్, గణేష్, స్థానిక సర్పంచ్‌లు మడావి రాజేష్, తుమారం మను, పెరిమల వెంకన్న, పంచాయతీ కార్యదర్శులు రాజేశ్వరి, మాధవి, రేషన్ డీలర్లు, స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# తిర్యాణి ప్రజావాణికి 21 ఫిర్యాదులు

### బీటీ రోడ్ల కోసమే ఎక్కువ వినతులు ఎంపీడీఓ నాగేశ్



తిర్యాణి : తిర్యాణి మండలంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 21 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ నాగేశ్ తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రజలు వివిధ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు.అందిన దరఖాస్తుల్లో బీటీ రోడ్ల మంజూరు కోసం 15, సీసీ రోడ్డు కోసం 1, నూతన రేషన్ షాపు కోసం 1, ఇందిరమ్మ ఇళ్ల కోసం 1, పెండింగ్ బిల్లుల కోసం 1, అంగన్‌వాడీ బిల్లు కోసం 1, గ్రామపంచాయతీ భవనం పూర్తి చేయాలని 1 దరఖాస్తు ఉన్నాయి. ప్రజావాణికి అన్ని శాఖల అధికారులు హాజరయ్యారని, అందిన దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ నాగేశ్ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బెల్టు దుకాణాల బారిన పేద కుటుంబాలు



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి: గ్రామాల్లో విచ్చలవిడిగా కొనసాగుతున్న బెల్టు దుకాణాలు కుటుంబాల పాలిట శాపంగా మారుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కుటుంబాన్ని పోషించేందుకు మహిళలు కష్టపడుతుంటే.. మరోవైపు సంపాదించిన సొమ్మును మద్యం కోసం ఖర్చు చేయడంతో ఇంటి అవసరాలు తీరక కుటుంబాలు ఆర్థికంగా కుదేలవుతున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మద్యం మత్తులో గొడవలు, కుటుంబ కలహాలు పెరుగుతుండటంతో మహిళలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోతున్నారు.

### దుర్గానగర్‌లో మహిళల ధర్నా

కాగజ్‌నగర్ మండలం దుర్గానగర్ గ్రామం నంబర్5లో బెల్టు దుకాణాలను పూర్తిగా తొలగించాలని కోరుతూ మహిళలు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించి ఈస్గాం పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రం సమర్పించారు. మద్యం కోసం డబ్బు ఖర్చవడంతో పిల్లల చదువులు, ఇంటి సరుకులు, వైద్య ఖర్చులు భారంగా మారుతున్నాయని తెలిపారు. మద్యం సేవించి ఇంటికి వచ్చే కొందరి కారణంగా కుటుంబాల్లో గొడవలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

### జిల్లా వ్యాప్తంగా విచారణకు డిమాండ్

దుర్గానగర్ సమస్యను ఒక గ్రామానికే పరిమితం చేయకుండా ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా బెల్టు దుకాణాలు, అక్రమ మద్యం విక్రయాలపై సమగ్ర విచారణ జరపాలని ప్రజలు కోరుతున్నారు. పలు గ్రామాలు, పట్టణాల్లో అనధికారికంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. అక్రమ మద్యం ఎక్కడి నుంచి సరఫరా అవుతోంది.. ఎవరి ద్వారా గ్రామాలకు చేరుతోంది అనే విషయాలను అధికారులు తేల్చాలని కోరుతున్నారు. తనిఖీలతో పాటు సరఫరా మూలాలను గుర్తించి కట్టడి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దుర్గానగర్ మహిళల ఫిర్యాదుపై కలెక్టర్, ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించి విచారణ జరిపించాలని, అక్రమ విక్రయాలు నిజమని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# పాఠశాలను సందర్శించిన కొక్కిరాల సురేఖ



మంచిర్యాల, : లక్షెట్టిపేట్ మండలంలోని కొత్త కొమ్ముగూడెం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలను మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బిస్కెట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. పాఠశాల ఉపాధ్యాయులతో మాట్లాడిన సురేఖ, విద్యార్థులకు అందుతున్న విద్యా సౌకర్యాలు, పాఠశాలలోని మౌలిక వసతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ఉన్న సమస్యలను ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం సురేఖను ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ముందుగా విద్యార్థులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సందేల సుజాత-సురేష్, లక్షెట్టిపేట్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు, ఉప సర్పంచ్ బొప్పు సుమన్, మంచిర్యాల జిల్లా ఆర్టీఏ మెంబర్ అంకతి శ్రీనివాస్, లక్షెట్టిపేట్ మండల అధ్యక్షులు, సర్పంచ్ నలిమెల రాజు, లక్షెట్టిపేట్ పట్టణ అధ్యక్షులు సయ్యద్ షాహిద్ అలీ, మంచిర్యాల జిల్లా ఆర్జీపీఆర్ఎస్ గడ్డం త్రిమూర్తి, మండల వైస్ ప్రెసిడెంట్ కందుల మోహన్, జిల్లా నాయకులు బియ్యాల తిరుపతి, మండల మాజీ అధ్యక్షులు పింగిలి రమేష్, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్య బాధతో యువతి ఆత్మహత్య



ఆసిఫాబాద్: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణం తైబా నగర్‌కు చెందిన సుమాయా మహేక్ (18) అనారోగ్య బాధతో ఆత్మహత్యకు పాల్పడింది. గత నాలుగు నెలలుగా రక్తహీనత, కడుపునొప్పి సమస్యలతో చికిత్స పొందుతున్నా ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో మనోవేదనకు గురైనట్లు కుటుంబ సభ్యుల సమాచారం. తేదీ 23-08-2026న సాయంత్రం 18:20 గంటల ప్రాంతంలో తల్లి పక్కింటికి వెళ్లిన సమయంలో సుమాయా పడకగదిలో ప్రాణాలు తీసుకుంది. కుటుంబ సభ్యులు, ఇరుగుపొరుగువారు ఆమెను వెంటనే కాగజ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు రాత్రి 19:15 గంటలకు మృతిచెందినట్లు ధృవీకరించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు 24-08-2026న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు. మృతిపై ఎటువంటి అనుమానం లేదని కుటుంబ సభ్యులు పోలీసులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సుమాయా మహేక్ (మృతురాలు), కుటుంబ సభ్యులు, కాగజ్‌నగర్ పోలీసులు పాల్గొన్న వారు

# కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డికి విప్లవ జోహార్లు



ఆసిఫాబాద్ : కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లోని ప్రజా సంఘాల కార్యాలయంలో సీపీఎం పార్టీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రైతాంగ ఉద్యమ నేత కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణలోనూ రైతులు, వ్యవసాయ రంగ సమస్యలపై మల్లారెడ్డి నిరంతరం పోరాటాలు చేశారని నాయకులు గుర్తుచేసుకున్నారు. నీటిపారుదల ప్రాజెక్టుల చరిత్రను అధ్యయనం చేసి వ్యవసాయ రంగాభివృద్ధిపై అనేక విశ్లేషణలు చేసిన వ్యక్తిగా అభివర్ణించారు. వర్గ పోరాటాల ద్వారానే సమాజ విముక్తి సాధ్యమని విశ్వసించిన మల్లారెడ్డి తుది శ్వాస వరకు ఎర్రజెండా భుజస్కందాలపై మోస్తూ రైతాంగం, కార్మికులు, పేదల సమస్యలపై ఉద్యమించారని నాయకులు పేర్కొన్నారు. మల్లారెడ్డి మరణం రైతాంగ ఉద్యమానికి, సీపీఎం పార్టీకి, ప్రజా సంఘాలకు తీరని లోటని, ఆశయాల సాధనే నిజమైన నివాళి అని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుశల రాజన్న (రైతు సంఘం నాయకులు), ముంజం ఆనంద్ కుమార్ (వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి), పందుగ రాజేష్ (వికలాంగుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షులు), మహేష్ తదితరులు పాల్గొన్నారు

# నేడే మందమర్రి డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు

### పారదర్శకంగా లక్కీ డ్రా ద్వారా లబ్ధిదారుల ఎంపిక




మందమర్రి : మందమర్రి మండల కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పనకంటి సతీష్ కుమార్ శర్మ తెలిపారు.మంచిర్యాల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ కార్యాలయంలో ప్రకటించిన అర్హుల జాబితా ఆధారంగా ఈ నెల 25న ఉదయం 10 గంటలకు సండ్రోన్‌పల్లి గ్రామ పరిధిలోని ఆర్‌కే ఫంక్షన్ హాల్‌లో జిల్లా అధికారుల సమక్షంలో లక్కీ డ్రా నిర్వహించనున్నట్లు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. లక్కీ డ్రా ద్వారా అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి, వారికి డబుల్ బెడ్రూం ఇళ్లలోని బ్లాక్, ఫ్లోర్ కేటాయిస్తామని పేర్కొన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా కేటాయింపు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. లబ్ధిదారులకు మాత్రమే హాల్‌లోకి అనుమతి ఉంటుందని, ఇతరులకు ప్రవేశం లేదని తెలిపారు. లబ్ధిదారులు తప్పనిసరిగా ఆధార్ కార్డు వెంట తీసుకురావాలని సూచించారు.కేటాయింపు అనంతరం ఎవరైనా అనర్హులు ఉన్నట్లు వ్రాతపూర్వకంగా ఫిర్యాదులు అందితే సమగ్ర విచారణ చేపట్టి, అనర్హులకు కేటాయించిన ఇళ్లను రద్దు చేయడంతో పాటు నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.నిజమైన అర్హులకు ఇళ్లు దక్కేలా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో ప్రజలు అధికారులకు సహకరించాలని కోరారు. ఏవైనా అభ్యంతరాలు, ఫిర్యాదులు ఉంటే నేరుగా ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

# సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత వృత్తి విద్యా శిక్షణ

మందమర్రి : సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ మందమర్రి ఏరియా పరిధిలోని సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలు, యువత స్వయం ఉపాధి పొందేందుకు వివిధ వృత్తి విద్యా కోర్సుల్లో ఉచిత శిక్షణ అందించనున్నట్లు డీజీఎం (పర్సనల్) సీహెచ్. అశోక్ తెలిపారు.టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్ కోర్సుల్లో 3 నెలలు, కంప్యూటర్ డీటీపీ (డీటీపీ)లో 2 నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.గనుల కారణంగా భూములు కోల్పోయిన భూ నిర్వాసితుల భార్యలు, పిల్లలు, మందమర్రి ఏరియా సింగరేణి కార్మికులు, మాజీ కార్మికుల భార్యలు, పిల్లలతో పాటు కేకే ఓసీపీ, ఆర్కే ఓసీపీ ప్రాజెక్టుల పరిసర ప్రాంతాలు, బెల్లంపల్లి, కాసిపేట, సోమగూడెం, మందమర్రి, రామకృష్ణాపూర్ పరిసర గ్రామాల మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చు.ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఆగస్టు 31లోగా మందమర్రి జీఎం కార్యాలయంలోని జీఎం పీఏ ఆఫీస్‌లో దరఖాస్తులు సమర్పించాలి.దరఖాస్తుకు ఎస్ఎస్‌సీ మెమో, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో జత చేయాలి. సింగరేణి ఉద్యోగులు లేదా మాజీ కార్మికుల కుటుంబ సభ్యులు సింగరేణి ఐడెంటిటీ కార్డు జత చేయాల్సి ఉంటుంది.మరిన్ని వివరాలకు 7032878575, 9490940391 నంబర్లలో సంప్రదించాలని అధికారులు సూచించారు.

# డంప్‌యార్డ్ నుంచి రోడ్డుపైకి వ్యర్థాలు.. వాహనదారులకు తిప్పలు



మందమర్రి : ఆర్కే1 బైపాస్ రోడ్డులోని డంప్‌యార్డ్ నుంచి వ్యర్థాలు రోడ్డుపైకి చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డంప్‌యార్డ్‌లో చెత్తను సక్రమంగా నిర్వహించి, బయటకు రాకుండా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహించడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.డంప్‌యార్డ్‌లో ఉండాల్సిన వ్యర్థాలు రోడ్డుపైకి ఎందుకు వస్తున్నాయి? చెత్తను సక్రమంగా నిల్వ చేసే ఏర్పాట్లు లేవా? వర్షం వచ్చిన ప్రతిసారీ వ్యర్థాలు రోడ్డుపైకి కొట్టుకురావడం అధికారుల దృష్టికి రావడం లేదా? అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.రోడ్డుపై చెత్త పేరుకుపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. దుర్వాసన, అపరిశుభ్రతతో పాటు పందులు, ఇతర జంతువులు రోడ్డుపై సంచరిస్తుండటంతో ప్రమాదాల ప్రమాదం కూడా నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డంప్‌యార్డ్‌ను సక్రమంగా నిర్వహించి, వ్యర్థాలు రోడ్డుపైకి రాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

# ప్రజావాణి దరఖాస్తులు సత్వర పరిష్కారానికి ఆదేశం



ఆసిఫాబాద్ : కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవనంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సిర్పూర్ (టి) మండలానికి చెందిన షకీల్ హుస్సేన్ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో క్యాటరింగ్ సప్లై బిల్లుల చెల్లింపు కోరుతూ దరఖాస్తు అందజేశారు. జైనూర్ మండలం దూరాతండా గ్రామస్తులు తమ గ్రామ ఆశా కార్యకర్తను తొలగించాలని కోరారు. రెబ్బెన మండలం గోనేటి గ్రామ రైతులు తమ ఆర్ఓఎఫ్ఆర్ భూముల్లో వేసిన బోర్లకు విద్యుత్ సరఫరా కోరారు. ఆసిఫాబాద్ మండలం బాబాపూర్‌కు చెందిన మసాడె అరుణ్ తన కుమారుడికి గురుకుల విద్యాలయంలో సీటు కోరారు. దహేగాం మండలం కమ్మరపల్లికి చెందిన జరుపుల సురేష్ తండ్రి పేరిట గల భూమిని తన పేరిట వారసత్వ మార్పిడి కోరారు. పెంచికలపేట మండలం గుండెపల్లికి చెందిన తలండి ముత్తుబాయి తాము సాగు చేస్తున్న ప్రభుత్వ భూమికి పట్టా మంజూరు కోరుతూ అర్జీ సమర్పించారు.

# వన మహోత్సవం లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేయాలి

### మంత్రి కొండా సురేఖ




ఆసిఫాబాద్ : కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో వన మహోత్సవంలో భాగంగా నిర్దేశించిన మొక్కలు నాటే లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర మంత్రి ఛాంబర్ నుండి పీసీసీఎఫ్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా అటవీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. 2026-27 సీజన్‌లో జిల్లాలకు కేటాయించిన లక్ష్యాల ప్రకారం మొక్కలు నాటే కార్యక్రమం త్వరగా పూర్తి చేయాలని, నాటిన ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేసి సంరక్షించాలని, బృహత్ పల్లె వనాల్లో మొక్కలు పెంచాలని మంత్రి సూచించారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, జిల్లా అటవీ అధికారి బాలమణి సమావేశంలో పాల్గొన్నారు. జిల్లాకు కేటాయించిన 47 లక్షల మొక్కలు నాటే లక్ష్యాన్ని అధికారుల సమన్వయంతో త్వరలో పూర్తి చేస్తామని, ప్రభుత్వ స్థలాలు, రహదారికి ఇరువైపులా, చెరువుగట్లు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల ఆవరణలో మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నామని అదనపు కలెక్టర్ తెలియజేశారు.

# మిలాద్-ఉన్-నబీ సందర్భంగా శాంతి కమిటీ సమావేశం



చెన్నూర్, : మిలాద్-ఉన్-నబీ సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశానికి చెన్నూర్ ఎస్సై శ్యామ్ పటేల్ తో కలిసి రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సమక్షంలో శాంతి కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఈ సమావేశంలో చెన్నూర్ జామా మసీదు ఇమామ్ సర్ఫరాజ్ నూరి, ఆర్గనైజర్ ఫసీ ఉద్దీన్, 17వ వార్డు కౌన్సిలర్ అజీముద్దీన్, ఎ ఎం సి డైరెక్టర్ ఎం.డి. జైనుల్ అబీదీన్ పాల్గొన్నారు. మిలాద్-ఉన్-నబీ వేడుకలు మరియు ఊరేగింపును శాంతియుతంగా, సోదరభావంతో, అన్ని వర్గాల సమన్వయంతో నిర్వహించేందుకు పోలీసు అధికారులు మరియు కమిటీ సభ్యులు చర్చించారు. తాండూర్ మండల పి ఆర్ టి యు టి ఎస్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక తాండూర్ వాస్తవ గమ్యం ఆగస్టు 24 : మండల పి ఆర్ టి యు టి ఎస్ సర్వసభ్య సమావేశం సోమవారం ఎం పి యు పి ఎస్ బోయపల్లి పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా చల్లూరి ఆనంద్, ప్రధాన కార్యదర్శిగా మధుసూదన్, అసోసియేట్ అధ్యక్షులుగా శ్రీకాంత్, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా ఎం. శైలజ, ఉపాధ్యక్షులుగా లింగయ్య, మహిళా ఉపాధ్యక్షురాలిగా భాగ్యలక్ష్మి, కార్యదర్శిగా ఎస్. శ్రీధర్, మహిళా కార్యదర్శిగా ఎన్. స్వప్న ఎన్నికయ్యారు.జిల్లా ఎన్నికల అధికారి కే. జనార్ధన్ ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు కొట్టి శంకర్, ఎన్నికల పరిశీలకులు మహేష్, రంగయ్య, జిల్లా బాధ్యులు అజీముద్దీన్‌తో పాటు ప్రాథమిక సభ్యులు పాల్గొన్నారు.

## పడిక్కల్, జురెల్ శతకాల మోత..

# భారత్ 503/9 డిక్లేర్



కొలంబో వేదికగా శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో టీమిండియా 9 వికెట్ల నష్టానికి 503 పరుగుల వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. బౌలర్లకు అనుకూలిస్తున్న పిచ్‌పై భారత బ్యాటర్లు చెలరేగడంతో తొలి టెస్టు తరహాలోనే రెండో టెస్టులోనూ భారత్ స్పష్టమైన ఆధిక్యం కనబరిచింది. దేవదత్ పడిక్కల్ (193 బంతుల్లో 117), ధ్రువ్ జురెల్ (115 నాటౌట్)సెంచరీలతో చెలరేగారు. మిగతా బ్యాటర్లలో వికెట్ కీపర్ రిషబ్ పంత్ (63), కెప్టెన్ గిల్ (50) అర్ధసెంచరీలు సాధించగా, జైస్వాల్ (45), జడేజా (43) రాణించారు. లంక బౌలర్లలో అసితా ఫెర్నాండో 4 వికెట్లు తీయగా, కెషారా నువంతా, ప్రబాత్ జయసూరియ చెరో 2 వికెట్లు పడగొట్టారు. ఓవర్‌నైట్ స్కోరు 300/5తో రెండో రోజు ఆట ప్రారంభించిన టీమిండియా 307 పరుగుల వద్ద డెబ్యూ ఆటగాడు సారాంశ్ జైన్ (6) ఔట్ కావడంతో ఆరో వికెట్ కోల్పోయింది.

### పంత్‌తో కలిసి సెంచరీ భాగస్వామ్యం

అయితే మొదటి రోజు ఆటలో గాయంతో రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగిన రిషబ్ పంత్ మళ్లీ క్రీజులోకి వచ్చాడు. ధ్రువ్ జురెల్‌తో కలిసి పంత్ ఇన్నింగ్స్‌ను నడిపించాడు. ఈ ఇద్దరు కలిసి ఏడో వికెట్‌కు 152 బంతుల్లో 112 పరుగులు జోడించారు. ఈ క్రమంలోనే పంత్, జురెల్‌లు హాఫ్ సెంచరీలు పూర్తి చేసుకున్నారు. వీరిద్దరి జోడీ బలపడుతున్న తరుణంలో కెషారా నువంతా బౌలింగ్‌లో పంత్ (63) వెనుదిరిగాడు.

### టెస్టు కెరీర్‌లో రెండో సెంచరీ

ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన మానవ్ సుతార్ (18) సాయంతో ధ్రువ్ జురెల్ ఇన్నింగ్స్ పరుగులు పెట్టించాడు. వర్షం అంతరాయంతో టీ బ్రేక్ సమయానికి భారత్ 8 వికెట్ల నష్టానికి 475 పరుగుల వద్ద నిలిచింది. వర్షం తర్వాత భారత్ ఇన్నింగ్స్ ఎక్కువ సేపు సాగకపోయినప్పటికీ, జురెల్ తన కెరీర్‌లో రెండో టెస్టు సెంచరీ మార్క్ అందుకున్నాడు. ఆ తర్వాత సిరాజ్ (3) ఔటవ్వడంతో భారత్ 489 పరుగుల వద్ద తొమ్మిదో వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత జురెల్ ఒక సిక్సర్ సహా రెండు ఫోర్లు కొట్టడంతో టీమిండియా స్కోరు 500 పరుగుల మార్క్ దాటింది. వెంటనే కెప్టెన్ గిల్ 503 పరుగుల వద్ద భారత ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేశాడు.

## వైభవ్ సూర్యవంశీ ప్లాఫ్ షో వెనుక కారణమిదే?



దులీప్ ట్రోఫీ 63వ ఎడిషన్ ఆదివారం ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఈస్ట్ జోన్‌తో నార్త్‌ఈస్ట్ జోన్, నార్త్ జోన్‌తో వెస్ట్ జోన్ తలపడుతున్నాయి. అయితే దులీప్ ట్రోఫీలో అందరి కళ్లు ఈస్ట్‌జోన్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న వైభవ్ సూర్యవంశీపై నెలకొని ఉన్నాయి. కానీ మ్యాచ్ ప్రారంభమైన కాసేపటికే వైభవ్ మూడు ఫోర్లు కొట్టినప్పటికీ చెత్త షాట్ ఆడి పెవిలియన్ చేరాడు. నార్త్‌ఈస్ట్ జోన్ పేసర్ బిష్వోర్జిత్ కొంతోజమ్ బౌలింగ్‌లో వైభవ్ వెనుదిరిగాడు. అయితే పెవిలియన్ చేరుతున్న క్రమంలో వైభవ్ జెర్సీ వెనుక భాగంలో ఉన్న సంఖ్యకు టేప్ అంటించి ఉండడం అభిమానులు గమనించారు. ఆ తర్వాత ఫీల్డింగ్ సమయంలోనూ వైభవ్ జెర్సీ వెనుక భాగంలో టేప్ అలాగే ఉండడం కనిపించింది. దీంతో అసలు వైభవ్ జెర్సీకి టేప్ ఎందుకు వేసుకున్నాడనే దానిపై ఆరా తీశారు. దీంతో విషయం బయటపడింది. మ్యాచ్‌లో వైభవ్ 13వ నంబర్ ఉన్న జెర్సీని ధరించాడు. నిజానికి వైభవ్ సూర్యవంశీ జెర్సీ నెంబర్ 3. ఐపీఎల్ రాజస్తాన్ రాయల్స్ జట్టు తరపున ఇదే జెర్సీ నెంబర్‌తో బరిలోకి దిగాడు. ఆ తర్వాత టీమిండియా తరపున అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన సమయంలోనూ వైభవ్ మూడు నెంబర్ జెర్సీతోనే ఆడాడు. అయితే దులీప్ ట్రోఫీలో వైభవ్‌కు మూడో నెంబర్ జెర్సీ స్థానంలో 13వ నెంబర్ జెర్సీ అందించారు. ఈస్ట్ జోన్ జట్టు వైభవ్ కోసం తనకు అచ్చొచ్చిన మూడో నెంబర్ జెర్సీని అందించడంలో విఫలమైందని లాజిస్టిక్స్ మేనేజర్ తెలిపాడు. తనకు మూడు నెంబర్ జెర్సీ అయితేనే అచ్చొస్తుందని భావించాడేమో.. అందుకే వైభవ్ తనకు ఇచ్చిన 13వ నెంబర్ జెర్సీలో ఒకటి సంఖ్య కనిపించకుండా టేప్ అంటించాడు. ఒకటి సంఖ్య లేకపోవడంతో ఇప్పుడు ఆ జెర్సీ 3 నెంబర్‌గా మారిపోయింది. ఇక మ్యాచ్‌లో ఓపెనర్‌గా వచ్చిన వైభవ్ 6 బంతుల్లో 8 పరుగులు చేసి నిష్క్రమించాడు. దీంతో అభిమానులు వైభవ్ జెర్సీపై ఫన్నీ కామెంట్స్ చేశారు. “పాపం జెర్సీ మారడంతో వైభవ్‌కు లక్ కలిసిరాలేదని కొందరు పేర్కొంటే... ఒకవేళ తనకు అచ్చొచ్చిన 3వ జెర్సీ నెంబర్‌ను ఇచ్చి ఉంటే మ్యాచ్‌లో ఇరగదీసేవాడేమో” అని మరికొందరు తెలిపారు. అయితే వైభవ్ తన జెర్సీని తెప్పించాలని ఇప్పటికే ఈస్ట్‌జోన్ జట్టుకు సమాచారం ఇచ్చాడట. రెండో ఇన్నింగ్స్‌లో వైభవ్ సూర్యవంశీ తన లక్కీ నెంబర్ జెర్సీతోనే బరిలోకి దిగే అవకాశం లేకపోలేదు.

## భారత కబడ్డీ జట్టు ప్రకటన.. కెప్టెన్ ఎవరంటే?



జపాన్ వేదికగా జరగనున్న ఆసియా క్రీడలు-2026 కోసం 12 మంది సభ్యులతో కూడిన భారత పురుషుల, మహిళల కబడ్డీ జట్టును ఏకేఎఫ్ఐ ప్రకటించింది. పురుషుల జట్టు కెప్టెన్‌గా స్టార్ రైడర్ పవన్ సెహ్రావత్ వ్యవహరించనుండగా.. మహిళల జట్టుకు రీతు నేగి నాయకత్వం వహించనుంది. మెన్స్ జట్టులో ప్రో కబడ్డీ లీగ్ స్టార్ రైడర్లు అయన్ లోచ్‌హాబ్, దేవాంక్ దలాల్‌కు చోటు దక్కింది. వీరిద్దరూ పవన్ సెహ్రావత్ రైడింగ్ బాధ్యతలను పంచుకోనున్నారు. అర్జున్ దేష్వాల్, అషు మాలిక్ కూడా రైడింగ్ విభాగంలో సపోర్ట్‌గా ఉండనున్నారు. అదేవిధంగా సునీల్ కుమార్, సుమిత్ సాంగ్వాన్ డిఫెన్స్ విభాగాన్ని ముందండి నడిపించనున్నారు. 2023 ఆసియా క్రీడల్లో స్వర్ణం గెలిచిన భారత కబడ్డీ జట్టు నుంచి ఈసారి కేవలం నలుగురు (అర్జున్ దేష్వాల్, సునీల్ కుమార్, పవన్ షెరావత్, అస్లాం ఇనామ్‌దార్) ఆటగాళ్లకు మాత్రమే చోటు దక్కడం గమనార్హం. కాగా ఈ ఏడాది ఆసియా క్రీడలు సెప్టెంబర్ 19 నుండి అక్టోబర్ 4 వరకు జరగనున్నాయి. ఈ ఈవెంట్‌లో కబడ్డీ పోటీలు సెప్టెంబర్ 21 నుండి 26 వరకు నాగోయా సిటీ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ సెంటర్‌లో జరగనున్నాయి.

### భారత పురుషుల కబడ్డీ జట్టు:

అషు మాలిక్, అయన్ లోచ్‌హాబ్, దేవాంక్ దలాల్, అర్జున్ దేష్వాల్, సునీల్ కుమార్, జైదీప్ దహియా, రాహుల్ సేత్‌పాల్, గౌరవ్ ఖత్రి, సుమిత్ సాంగ్వాన్, అంకిత్ జగ్లాన్, పవన్ షెరావత్, అస్లాం ఇనామ్‌దార్.

### భారత మహిళల కబడ్డీ జట్టు:

రీతూ నేగి, పుష్ప రాణా, సోనాలి షింగేట్, సంజు దేవి, పూజా కజ్లా, రీతూ షెరోన్, జ్యోతి ఠాకూర్, పింకీ రాయ్, మనీషా కుమారి, భవానా ఠాకూర్, రాజ్‌రాణి, నికితా కుమారి.

# ధోనీ రికార్డు బ్రేక్ చేసిన పంత్ గాయంతో మైదానాన్ని వీడి తిరిగొచ్చి మరీ!

**తొలి రోజు గాయంతో మధ్యలోనే వెనుదిరిగిన రిషభ్ పంత్ రెండో రోజు మళ్లీ బ్యాటింగ్‌కు వచ్చి రికార్డు- టెస్టు రికార్డులో ధోనీని దాటేసిన పంత్**



టీమ్?ఇండియా వికెట్ కీపర్ రిషభ్ పంత్ మరో అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. భారత మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ పేరిట ఉన్న అరుదైన రికార్డును బ్రేక్ చేశాడు. విదేశీ టెస్టుల్లో ఇప్పటివరకు ఏ భారత వికెట్ కీపర్‌కు సాధ్యం కాని మార్క్‌ను పంత్ అందుకున్నాడు. శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో చేతికి దెబ్బ తగలడంతో తొలిరోజు ఆట మధ్యలోనే పంత్ వెనుదిరిగిన పంత్, రెండో రోజు తిరిగి బ్యాటింగ్‌కు వచ్చాడు. గాయం కారణంగా మళ్లీ క్రీజులోకి వస్తాడా? అనే సందేహాలు వచ్చినా బ్యాటింగ్ కొనసాగించాడు. ఈ క్రమంలోనే క్రీజులోకి వచ్చి క్రేజీ రికార్డును సాధించాడు.

### ధోనీని దాటేసిన పంత్

విదేశీ వేదికల్లో జరిగిన టెస్టుల్లో వికెట్ కీపర్‌గా అత్యధిక పరుగులు చేసిన భారత బ్యాటర్‌గా పంత్ రికార్డులకెక్కడు. తాజా ఇన్నింగ్స్?తో అతడు 2500 పరుగులు మార్క్ దాటేశాడు. బ్యాటింగ్ సగటు 41.68గా ఉంది. ఈ క్రమంలో మాజీ వికెట్ కీపర్, కెప్టెన్ ధోనీని పంత్ అధిగమించాడు. ఈ మ్యాచ్?కు ముందు ఈ రికార్డు ధోనీ పేరిట ఉండేది. విదేశీ టెస్టుల్లో ధోనీ 2,496 పరుగులు చేశాడు. ఇప్పుడు ఆ రికార్డును పంత్ దాటేసి, ఫారిన్ మైదానాల్లో అత్యధిక పరుగులు చేసిన భారత వికెట్ కీపర్?గా కొనసాగుతున్నాడు. ఈ లిస్ట్‌లో ఫరూక్ ఇంజినీర్ 1,209 పరుగులతో మూడో స్థానంలో ఉండగా, సయ్యద్ కిర్మానీ 1,109, కిరణ్ మోరే 901 పరుగులతో తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

### తొలి రోజు చేతికి దెబ్బ

కొలంబోలో జరుగుతున్న రెండో టెస్టు తొలి రోజే పంత్‌ను గాయం ఇబ్బంది పెట్టింది. మూడో సెషన్‌లో శ్రీలంక పేసర్ లహిరు కుమార వేసిన షార్ట్ బాల్‌ను పుల్ చేసేందుకు ప్రయత్నించగా బంతి ఆయన ఎడమ చేతికి తగిలింది. నొప్పితో ఇబ్బంది పడిన పంత్‌ను భారత ఫిజియో వెంటనే పరిశీలించారు. మొదట ఐస్ ప్యాక్ పెట్టి ఆ తర్వాత చేతికి టేప్ వేశారు. అయినా అసౌకర్యంగా ఉండటంతో బ్యాటింగ్ కొనసాగించలేకపోయారు. అప్పటికి 15 బంతుల్లో మూడు పరుగులు చేసిన పంత్ 58వ ఓవర్లో రిటైర్డ్ హర్ట్‌గా మైదానం వీడారు.

### రెండో రోజు మళ్లీ క్రీజులోకి

గాయంతో తొలి రోజు బయటకు వెళ్లిన పంత్ రెండో రోజు బ్యాటింగ్‌కు వచ్చారు. సారాంశ్ జైన్ 6 పరుగుల వద్ద అసిత ఫెర్నాండో బౌలింగ్‌లో ఔటైన తర్వాత ధ్రువ్ జురెల్‌కు జత కలిశారు. పంత్ క్రీజులోకి వచ్చిన తర్వాత శ్రీలంక పేసర్లు షార్ట్ బాల్స్‌తో పరీక్షించారు. కొన్ని బంతులు ఆయన భుజానికి తగిలినా బ్యాటింగ్ కొనసాగించారు. మరో ఎండ్‌లో జురెల్ కూడా మంచి సపోర్ట్ ఇచ్చారు. ఇద్దరూ కలిసి డ్రింక్స్ బ్రేక్ వరకు 47 పరుగుల భాగస్వామ్యం నమోదు చేసి భారత ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లారు. ఇదే సమయంలో అవసరమైన పరుగులు సాధించిన పంత్, ధోనీ 2,496 పరుగుల రికార్డును అధిగమించారు.

### విదేశాల్లో ఇలా

పంత్ కెరీర్‌లో విదేశాల్లో ఆడిన టెస్టులకు ప్రత్యేకమైన స్థానం ఉంది. 2018లో ఇంగ్లండ్‌పై ఓవల్‌లో 114 పరుగులతో తన తొలి టెస్ట్ సెంచరీ నమోదు చేశారు. ఆ తర్వాత 2019 సిడ్నీ టెస్టులో ఆస్ట్రేలియాపై అజేయంగా 159 పరుగులు చేశారు. 2022లో కేప్‌టౌన్‌లో దక్షిణాఫ్రికాపై కూడా సెంచరీ సాధించారు. ఇంగ్లండ్‌లోనూ పంత్ పలుమార్లు కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. ఇప్పుడు విదేశీ, న్యూట్రల్ టెస్టుల్లో పరుగుల పరంగా భారత వికెట్ కీపర్లలో ధోనీని దాటి అగ్రస్థానానికి చేరుకున్నారు. కొలంబో టెస్టులో చేతికి దెబ్బ తగిలినా రెండో రోజు బ్యాటింగ్‌కు రావడం, అదే ఇన్నింగ్స్‌లో ఈ రికార్డును అందుకోవడం పంత్ కెరీర్‌లో గుర్తుండిపోయే మూమెంట్ అని చెప్పవచ్చు.

# దేవదత్ పడిక్కల్ వరుస సెంచరీలు సాయి సుదర్శన్?కు డేంజర్ బెల్స్!

**శ్రీలంక పర్యటనలో రెండో సెంచరీతో అదరగొట్టిన దేవదత్ పడిక్కల్? - జట్టులో సాయి సుదర్శన్ బెర్త్ సంగతేంటి?**



శ్రీలంక పర్యటనలో భారత యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ అదరగొడుతున్నాడు. ఇటీవల గాలె వేదికగా జరిగిన తొలి మ్యాచ్?లో రెండు ఇన్నింగ్స్?ల్లో (167, 44) రాణించి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్?గా నిలిచాడు. తాజాగా కొలంబో టెస్టులోనూ తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తూ, మరో సెంచరీ నమోదు చేశాడు. అదివారం ప్రారంభమైన రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్?లో పడిక్కల్ 117 పరుగులతో రాణించాడు. దీంతో ప్రస్తుతం అందరి కళ్లూ పడిక్కల్?పై పడ్డాయి.

### అనుకోకుండా వచ్చిన అవకాశం!

ఛతేశ్వర్ పుజారా తర్వాత టెస్టుల్లో భారత్?కు నెం 3 స్థానాన్ని భర్తీ చేయడం సవాల్?గా మారింది. టెస్టుల్లో కీలకమైన ఈ వన్?డౌన్?లో పలువురు బ్యాటర్లను పరీక్షించి చూసింది. అయితే గతేడాది సాయి సుదర్శన్ సుదీర్ఘ ఫార్మాట్?లో అరంగేట్రం చేయడంతో అతడే ఆ ప్లేస్?లో బ్యాటింగ్? చేస్తున్నాడు. అప్పట్నుంచి నెం 3 స్థానానికి మేనేజ్?మెంట్ కూడా సుదర్శన్ పేరునే పరిశీలిస్తుంది. ఈ లంక పర్యటనలో కూడా మొదట సుదర్శన్?నే ఎంపిక చేసింది. అయితే అతడు గాయం నుంచి పూర్తిగా కోలుకోకపోవడంతో ఆ ఛాన్స్ పడిక్కల్?కు వచ్చింది. అలా వచ్చిన అవకాశాన్ని పడిక్కల్ పూర్తిగా సద్వినియోగం చేసుకుంటున్నాడు. ప్రత్యర్థి బౌలర్లను సమర్థంగా ఎదుర్కొని పరుగులు సాధిస్తున్నాడు. తొలి టెస్టు తొలి ఇన్నింగ్స్?లో ఏకంగా 167 పరుగుల భారీ ఇన్నింగ్స్?తో ఆకట్టుకున్నాడు.

### నెం 3 సెట్ అయినట్లేనా?

నంబర్ 3 స్థానంలో కొంతకాలంగా ఫాస్ట్, స్పిన్ బౌలింగ్ రెండింటినీ సమర్థవంతంగా ఎదుర్కొనే టెస్టు బ్యాటర్ కోసం మేనేజ్?మెంట్ అన్వేషిస్తోంది. అయితే ఈ సిరీస్?లో వరుసగా రెండు మ్యాచ్?ల్లో సెంచరీ నమోదు చేయడంతో పడిక్కల్?పై ప్రశంసలు కురుస్తున్నాయి. సుదర్శన్ వచ్చినా జట్టులోంచి పడిక్కల్?ను తీసివేయొద్దంటూ ఫ్యాన్స్ అభిప్రాయపడుతున్నారు. తన ప్రదర్శనతోనూ పడిక్కల్ సెలక్టర్ల దృష్టిని ఆకర్షిస్తున్నాడు. నిలకడగా రాణిస్తూ పరుగులు చేస్తుండడంతో ఈ ప్లేస్?కు పడిక్కల్ సెట్ అయిపోయినట్లే అని అభిమానులు అభిప్రాయపడుతున్నారు.

### అప్పుడే అయిపోలేదు!

ప్రస్తుత టూర్?లో రెండు సెంచరీలు సాధించినంత మాత్రాన పడిక్కల్?ను అప్పుడే నెం 3 బ్యాటర్ అని కన్ఫర్మ్ అయిపోడానికి వీల్లేదు. ఎందుకంటే అతడికి అసలు పరీక్ష ఇప్పుడిప్పుడే మొదలవుతుంది. ఈ నిలకడను ఇలాగే కొనసాగిస్తేనే అతడికి వన్?డౌన్?లో అవకాశం ఉంటుంది. అంతేకానీ ఒకట్రెండు సిరీస్?లకు మాత్రమే ఈ ప్రదర్శన పరిమితమైతే మాత్రం కనుమరుగైపోయే ప్రమాదం ఉంది. గతంలో ఎందరో క్రికెటర్లు వచ్చిన కొత్తలో అదరగొట్టేసి, ఆ తర్వాత తుస్సుమనిపించారు. వాళ్లంతా ఇప్పుడు కనుమరుగైపోయారు. అందుకే పడిక్కల్ అలా కాకుండా పరిస్థితులకు తగ్గట్లు ఆడుతూ ఫామ్?ను కాపాడుకోవాల్సి ఉంటుంది.

### సుదర్శన్?కు డేంజర్ బెల్స్!

పడిక్కల్ ప్రస్తుతం నిలకడగా ఆడుతుండడంతో చాలా కాలంగా నంబర్ 3 స్థానం కోసం పోటీ పడుతున్న ఆటగాళ్లకు ఇది సవాలుగా మారుతుంది. అందులో సాయి సుదర్శన్ కూడా ఒకడు. గతేడాది నుంచి వన్?డౌన్?లో ఆడుతున్న సాయి సుదర్శన్ 7 మ్యాచ్?ల్లో 383 పరుగులు చేశాడు. ఇప్పుడు పడిక్కల్ ఇలాగే తన ఫామ్?ను కొనసాగిస్తే మాత్రం జట్టులో తన స్థానం ఖాయంగా ఉంటుంది.

# ‘టీమిండియా నుంచి వాళ్లను కూరలో కరివేపాకులా తీసేసారు’



టీమిండియా హెడ్‌కోచ్ గౌతం గంభీర్‌ను ఉద్దేశించి భారత మాజీ క్రికెటర్ వసీం జాఫర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. టెస్టుల్లో విఫలమైనప్పటికీ.. వైట్‌బాల్ క్రికెట్‌లో మాత్రం గంభీర్‌ను పెద్దగా తప్పుపట్టాల్సిన పనిలేదన్నాడు. అయితే, వైట్‌బాల్ క్రికెట్‌లో కొంతమంది పేరు మోసిన ఆటగాళ్లను కూడా కూరలో కరివేపాకులా తీసేసారంటూ.. గంభీర్ బృందం తీరును విమర్శించాడు. కాగా టీమిండియా ప్రస్తుతం శ్రీలంక పర్యటనలో ఉన్న సంగతి తెలిసిందే. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ 2025-27 ఫైనల్ రేసులో ఉండాలంటే లంకతో రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-0తో వైట్‌వాష్ చేయాల్సిందే. ఈ క్రమంలో తొలి టెస్టులో 165 పరుగుల తేడాతో ఘన విజయం సాధించిన భారత్.. రెండో టెస్టులోనూ విజయంపై కన్నేసింది. ఇదిలా ఉంటే.. స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో 3-0, సౌతాఫ్రికా చేతిలో 2-0తో వైట్‌వాష్ కావడం వల్లే టీమిండియా డబ్ల్యూటీసీ ప్రయాణం కఠినంగా మారింది. ఈ నేపథ్యంలో గంభీర్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చాయి. టెస్టు కోచ్‌గా అతడిని తొలగించాలనే అప్పట్లోనే డిమాండ్లు పెరిగాయి. ఇక ఇటీవల టీమిండియా అనూహ్య రీతిలో ఐర్లాండ్ గడ్డ మీద ఆతిథ్య జట్టు చేతిలో కనీవినీ ఎరుగని రీతిలో 2-0తో టీ20 సిరీస్‌లో క్లీన్‌స్వీప్ అయింది. ఆ తర్వాత ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌లో 4-0తో వైట్‌వాష్ అయిన భారత జట్టు.. వన్డే సిరీస్‌ను 1-2తో కోల్పోయింది. దీంతో వైట్‌బాల్ కోచ్‌గానూ గంభీర్ పనికిరాడనే విమర్శలు వచ్చాయి. కాగా భారత్‌కు టీ20 ప్రపంచకప్-2026 టైటిల్ అందించిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌పై యాజమాన్యం వేటువేసిన సంగతి తెలిసిందే. ఈ టోర్నీ తర్వాత టీమిండియా తొలిసారిగా ఐర్లాండ్ పర్యటనకు వెళ్లగా.. సూర్యను కెప్టెన్‌గా తప్పించడమే కాకుండా జట్టులోనే స్థానం లేకుండా చేశారు. అతడి స్థానంలో శ్రేయస్ అయ్యర్‌కు పగ్గాలు అప్పగించారు. మరోవైపు.. మహ్మద్ షమీ కూడా చాన్నాళ్లుగా పునరాగమనం కోసం ఎదురుచూస్తున్నా సెలక్టర్లు కరుణించడం లేదు. ఈ పరిణామాల నేపథ్యంలో భారత మాజీ ఓపెనర్ వసీం జాఫర్ స్పందించాడు. తన యూట్యూబ్ చానెల్ వేదికగా మాట్లాడుతూ.. “కొంతమంది ఆటగాళ్లను మరీ కూరలో కరివేపాకులా తీసేసారు. వాళ్లను ఇంకాస్త మంచిగా చూసుకోవాల్సింది. సూర్య విషయంలో ఇదే జరిగింది. వరల్డ్‌కప్ గెలిచిన తర్వాత అతడిపై నిర్దాక్షిణ్యంగా వేటువేశారు. ఇక సూర్య మాదిరే మరో ప్లేయర్ షమీ కూడా ఉన్నాడు. వీరి విషయంలో మేనేజ్‌మెంట్ వ్యవహారశైలి ఇంకాస్త మెరుగ్గా ఉంటే బాగుండేది. ఇవి తప్ప వైట్‌బాల్ క్రికెట్‌లో గంభీర్‌ను తప్పుబట్టడానికి పెద్దగా ఏమీ లేదు” అని వసీం జాఫర్ పేర్కొన్నాడు. అదే విధంగా.. “టెస్టుల్లో మాత్రం సొంతగడ్డపై న్యూజిలాండ్, సౌతాఫ్రికా చేతిలో టీమిండియా వైట్‌వాష్ కావడం సాధారణ విషయం కాదు. ఈ మచ్చ గంభీర్ కెరీర్‌పై ఎప్పటికీ ఉండిపోతుంది. అతడితో పాటు కెప్టెన్, ఆటగాళ్లు కూడా ఈ భారాన్ని మోయాల్సి ఉంటుంది. విదేశీ జట్లకు టీమిండియాను వారి స్వదేశంలో ఓడించడం అంత సులువు కాదు. అలాంటిది ఏకంగా రెండు వైట్‌వాష్‌లు. ఒకవేళ మనం ఆ సిరీస్ గెలిచి ఉంటే.. డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో ఇప్పుడు అగ్రస్థానంలో ఉండేవాళ్లము. టెస్టు కోచ్‌గా గంభీర్ ఇంకా మెరుగుపడాలి. అతడొక్కడే కాదు.. జట్టు కూడా మారాలి. అయితే, కొన్నిసార్లు సెలక్షన్ విషయంలో తప్పిదాల వల్ల కూడా మూల్యం చెల్లించాల్సి వస్తుంది” అని వసీం జాఫర్ అభిప్రాయపడ్డాడు. కాగా గంభీర్ మార్గదర్శనంలో టీమిండియా ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ (వన్డే)-2025, టీ20 ప్రపంచకప్-2026 టైటిళ్లు గెలిచింది. అయితే, డబ్ల్యూటీసీ 2025 ఫైనల్‌కు మాత్రం చేరలేకపోయింది.

Printed , Published and Owned by POLAGONI ALIVELU, and Printed at Smilys Online, 6-7-48, Vanasthalipuram, Shopping Complex, Rangareddy-500070. Telangana State and Published from 17-10-25, Plot No.H.No. 4-136/12, Turkayamjal Journalist Colony, Rangareddy501510, Telangana State. Editor: POLAGONI ALIVELU. PRGI No. TGTEL/25/A3190. Phone No: +91 7989151815